సెప్టెంబర్ - 2016

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక

ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

**చందా వివరములు :**

సంవత్సర చందా రూ. 150/-

పోషక చందా రూ. 1000/-

జీవిత చందా రూ. 3000/-

విడి ప్రతి రూ. 15/-


**మా చిరునామా :**

ఎడిటర్, పరిశుద్ధత

పోస్ట్‌బాక్స్ నెం. 28

ఒంగోలు - 523001

ఫోన్ : 08592-231281

సెల్ : 9704255416


## లోపలి పేజీల్లో...


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| బర్నబా | కొడవటికంటి | 03 |
| లియో టాల్‌స్టాయ్ | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 07 |
| నా ప్రభువును నేను వదల్లేదు | | 08 |
| | శ్రీవిద్య సాక్ష్యము | |
| బైబిల్ కథలు | మామయ్య కథలు | 11 |
| | రెవ.డా॥కె.జోసఫ్‌గారు | |
| బైబిలు ప్రాముఖ్యత | | 14 |
| | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | |
| ఏడు సంఘాలు | - తుయతైర సంఘము | 17 |
| | బ్రదర్ కె. సామ్రాట్‌గారు | |
| రూతు | శ్రీమతి రేచల్ జోసఫ్ | 19 |
| సువార్తికునిగా మారిన కమ్యూనిస్టు | | 20 |
| | కలపాల అబ్రాహాము సాక్ష్యము | |
| లోకంతీరు | ఇమ్మానియేలు రాజేంద్ర | 22 |
| అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ | | 24 |
| | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | |


India Evangelistic & Relief Fellowship

| **EVANGELISM** | **RELIEF** |
|---|---|
| Church Planting | Orphanage |
| Evangelestic, Crusades | Child Development Centers |
| Pastor's Seminars | Education (U.C.L.I. Schools) |
| Youth Ministry | Widows & Leprosy Care |
| T.V.Ministry | Medical Assistance |
| Magazine Ministry | Help in Natural Calamity |
| Audio Ministry | Flood Relief |
| Jail & Prison Ministry | Mobile Medical Ministry |
| IERF International | Children Care Ministry |
| Hanna Women Ministries | |


**ప్రకటన రేట్లు**

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |

# సంపాదకీయం.....



ప్రియ పరిశుద్ధత పాఠకులకు ప్రభువు నామమున శుభాభివందనములు.

గత నెలలో పత్రిక కొరకు రిజిష్టరు చేసుకున్న 98 మందికి పత్రిక పంపించాము. అయితే కొంతమంది అడ్రసులు పూర్తి వివరాలతో లేనందువల్ల వారికి పంపలేదు. ముఖ్యమైన విషయం ఏమిటంటే ఈ నెల పత్రికతో పాటు మనియార్డరు ఫాం పంపిస్తున్నాము. సంవత్సర చందా అయిన 150/- రూపాయలు పంపించగలరు. ఈ లోక సంబంధంగా మనం ఎంతో డబ్బు ఖర్చు చేస్తాము. మనకు ఏ విధంగాను ఉపయోగపడని విషయాలకు కూడా డబ్బు ఖర్చుచేస్తాము. ప్రతి నెలా టి.వి ఛానల్స్ కొరకు, న్యూస్ పేపర్, వారపత్రికలు, సినిమా పత్రికలు కొనడానికి డబ్బు ఖర్చుపెట్టడానికి ఏ మాత్రం వెనకాడము. అయితే సజీవమై బలముగలదై రెండంచులుగల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్ళను ములుగను విభజించునంత మట్టుకు దూరుచు, హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్న (హెబ్రీ.4:12) దేవుని వాక్యము కొరకు మనం ఎంత డబ్బు ఖర్చు చేస్తున్నాము? దేవుని కార్యములకు వ్యతిరేకి అయిన సాతాను దేవుని పని జరగకూడదని చందా కట్టనివ్వకుండా అడ్డుకుంటుంది. కావున పాఠకులు సహృదయముతో అర్థము చేసుకొని, పత్రిక అనేకమందికి పంపించుటకు పత్రిక సంవత్సర చందా కట్టి మీ వంతు సహాయం చేయండి. మీరు బ్యాంక్ అకౌంట్ ద్వారా ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేయదలచినట్లయితే మా అకౌంట్ నంబర్‌కి ట్రాన్స్‌ఫర్ చెయ్యండి. K. Joseph, Current A/c No. 13510200000175, Federal Bank, Ongole, IFSC Code FDRL0001351. మీరు ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేసినట్లయితే దయచేసి మాకు 9704255416 నంబర్‌కి ఫోన్ చేసి చెప్పండి లేదా 9440217726 కి మీ పేరు, పత్రిక అడ్రస్ లేబుల్ మీద మీ సీరియల్ నంబర్, ట్రాన్స్‌ఫర్ చేసిన మొత్తం SMS చెయ్యండి. చందాదారుల వివరాలను పత్రికా ముఖంగా ప్రచురిస్తాము. దేవుడు మిమ్మును సదాకాలము దీవించును గాక! ఆమెన్!

-ఎడిటర్

సీరియల్

# బర్నబా

4

**(అపొస్తలుడు రెండవభాగం)**

**– కొడవటికంటి**

ఈ మాటలు వింటున్నప్పుడు బర్నబా మనస్సు మధురంగా మారింది. "హతసాక్షి అవటానికి కూడా ముందుగా ఆయన నిర్ణయమై యుండాలి" అని చిన్నగా సౌలుతో అన్నాడు.

దమస్కు పట్టణంలో మూడు రోజులు గ్రుడ్డివానిగా యూదా ఇంటిలో ఉన్నప్పుడు తన కోసం ప్రార్థన చేయటానికి వచ్చిన అననీయతో ప్రభువు, 'అన్యజనుల ఎదుటను, రాజుల ఎదుటను, ఇశ్రాయేలీయుల ఎదుటను నా నామమును భరించుటకు ఇతడు నేనేర్పరచుకొనిన సాధనమైయున్నాడు. ఇతడు నా నామము కొరకు ఎన్ని శ్రమలు అనుభవింపవలెనో నేను ఇతనికి చూపుదును' అని అన్న మాటలు జ్ఞాపకము వచ్చినవి. తను ఎంతో ఆశీర్వదింపబడిన వానిగా అనిపించింది. బర్నబా వైపు ప్రేమగా చూశాడు. బర్నబా సౌలువైపు చూచినప్పుడు మనందరిలో ఎవరు ముందు ప్రభువు సన్నిధికి హతసాక్షిగా చేరుతాము? అన్నట్లుగా ఉంది.

ఉదయాన్నే మార్కు వచ్చి "హేరోదు అగ్రిప్ప సిసారియా పట్టణమునకు వెళ్ళిపోయాడు" అని తన మామతో చెప్పటం సౌలు విన్నాడు.

హేరోదు అని పిలువబడిన వారందరూ ఈ లోకం విడువవలసి వచ్చినప్పుడు బహు చింతాక్రాంతులుగాను, వ్యసనపరులుగాను మరణించారు అనుకున్నాడు. ఆ రోజంతా శిష్యులతోనే గడిపాడు. అంతియొకయ నుండి వారు తీసికొని వచ్చిన చందా యొక్క విలువనుబట్టి అంతియొకయలో సంఘము ప్రభువునందు ఎంత అభివృద్ధి చెందిందో తల్లి సంఘమునకు అర్థమైంది.

యెరూషలేము వచ్చినప్పటి నుండి బర్నబా హృదయము అంతియొకయ సంఘము వద్దనే ఉన్నది. అంతియొకయ సంఘము యొక్క అభివృద్ధి గురించి వినిన మార్కు తను కూడా అక్కడికి వెళ్ళటానికి తన తల్లి దగ్గర సెలవు పొందాడు.

ఉదయాన్నే గమలియేలుగారి దర్శనానికి బయలుదేరిన సౌలును అర్దోను పలకరించాడు. కొంచెం ఆలస్యమైనా అర్దోనుని గుర్తుపట్టాడు.

"గమలియేలుగారింటికా?" అన్నాడు అర్దోను.

ఔనని తలూపుతూ తనను ఇంత అప్యాయంగా పలకించిన అర్దోను వైపు సంతోషంగా చూశాడు పౌలు.

"ఆయన లేరని తెలియదా?" అన్నాడు అర్దోను

"ఎక్కడికి వెళ్ళారు?" అన్నాడు పౌలు.

కొంచెంసేపు మౌనం "మీరు అంతియొకయకు చేరిన రోజునే ఆయనకు ఆ వర్తమానము చేరింది. ఆయన ఎంతో సంతోషించారు. ఆ తర్వాత రెండు రోజులకు ఆయన పరమపదించారు" అన్నాడు అర్దోను.

ఆ మాట వినగానే తన హృదయాన్ని ఎవరో పిండినట్లుగా అనిపించింది. ఈ రోజు గమలియేలు గారితో ఎన్నో మాట్లాడాలని అనుకున్నాడు. ఇంకా ఎన్నో ఊహించుకున్నాడు. దేవుని చిత్తము ఇలా ఉంటుంది. తనతో శిష్యులు ఎందుకు ఈ సంగతి చెప్పలేదు? అనుకున్నాడు. దుఃఖం పొర్లుతున్నా ఏమి మాట్లాడకుండా ముందుకు సాగిపోతున్న సౌలును ఆపటానికి ధైర్యం చాల్లేదు అర్దోనుకు.

మాట్లాడుతున్న సౌలు కంటే మౌనంగా ఉన్న సౌలును పలకరించడం ఎవరికి సాధ్యం? తన గమనాన్ని మార్చుకొని కెద్రోను వాగు వైపు తిరిగిన సౌలు నొసటి మీద సూర్య కిరణాలు సూటిగా ప్రసరించాయి. తల పైకెత్తి చూస్తే

కొండమీద ఒలీవల చెట్లు ఎంతో ఎత్తులో కనిపించాయి. ఈ చెట్ల నీడన తనలాగ హృదయ వేదన పొందిన వారు ఎందరు విశ్రాంతి తీసుకోలేదు? ఇప్పటికి దాదాపు వెయ్యి సంవత్సరాల క్రితం తన కుమారుని తప్పించుకోవడానికి దావీదు మహారాజు కాళ్ళకు చెప్పులు లేకుండా ఈ వాగు దాటి ఈ చెట్ల నీడను సేదదీర్చుకున్నాడు.

కెద్రోను వాగు దుఃఖదాయకము. ప్రపంచము పుట్టిన తర్వాత ఏ మానవుడు పడని వేదన ప్రభువు ఈ వాగు దాటి వచ్చి ఇక్కడే ఆయన చెమట నేలను పడుతున్న గొప్ప రక్తబిందువులవలె ఆయెను అని పేతురు చెప్పాడు.

సౌలు అక్కడ ఉన్న ఒక రాతి మీద కూర్చున్నాడు. గమలియేలుగారు మరణించారు. ఇక ఈ పట్టణముతో తనకు ఋణం తీరిపోయింది. చిన్నతనంలోనే తార్సు నుండి యెరూషలేము వచ్చిన నాటనుండి నేటి వరకు తన హృదయములో నిండి ఉన్న వ్యక్తి గమలియేలుగారు ఇప్పుడు లేరు. ఇకను ఉండరు. అంతా చీకటిగా ఉన్నట్లు అనిపించింది. తను కూర్చున్న రాయి మీద నుండి క్రిందకు జారాడు. రెండు చేతులు బండ మీద చాచి తల బండ మీద పెట్టి 'ప్రభువా' అని మూలిగాడు. కళ్ళ వెంబడి నీరు ప్రవహిస్తున్నది. అవి తను కోరితే వచ్చినవి కావు.

మరునాడు ఉదయాన్నే బగ్గీ మీద బర్నబా, సౌలు, తీతు, మార్కు సిసారియా పట్టణానికి ప్రయాణమయ్యారు. చిన్నతనము నుండి తన తల్లిని విడిచి విదేశములకు వెళ్ళని మార్కుకు ఈ అనుభూతి ద్వంద్వమైంది. ఒక ప్రక్క సంతోషము మరోప్రక్క తన తల్లిని, పనివారిని, శిష్యుల సమూదాయమును, ముఖ్యముగా పేతురుగారిని విడచి వెళ్ళడము, అసలు పేతురుగారు ఇప్పుడు ఎక్కడ తల దాచుకున్నారో ఆలోచిస్తుంటే బాగా దిగులు వేసింది. సాయంకాలం సిసారియా పట్టణం చేరుకొనేటప్పటికి పట్టణ మంతా నిద్రావస్థలో ఉన్నట్లుగా బజారులన్నీ నిర్మానుష్యంగా ఉన్నవి. రేవులో ఓడలన్నీ ఎక్కడివక్కడ నిలచిపోయి ఉన్నాయి. సరుకులు మోసే కూలీల పాటలు వినబడలేదు. ఎవరూ సంతోషంగా ఉన్నట్లు కనిపించలేదు.

రేవు వద్ద బగ్గీ దిగినప్పుడు మొదటిగా వినబడిన వార్త హేరోదు అగ్రిప్ప మధ్యాహ్నం ఒంటిగంటకు చనిపో యాడని. మార్కు యొక్క సలహా మేరకు అదే గుఱ్ఱపు బగ్గీలో పట్టణానికి దక్షిణముగా ఉన్న బాటలో పది నిమిషాలు ప్రయాణం చేసిన తర్వాత సైనికుల నివాసము లున్న ప్రదేశంలో కొర్నేలి ఇంటికి వెళ్ళారు. సౌలు కొర్నేలిని చూడటం అదే మొదటిసారి. అందువలన చాలా సంతో షంగా ఉన్నది. ఆ రాత్రి భోజనం అయిన తర్వాత కొర్నేలితో మాట్లాడినప్పుడు అగ్రిప్ప మరణ వృత్తాంతం పూర్తిగా తెలిసింది.

యెరూషలేము వెళ్ళిన అగ్రిప్ప తన తాతవలె యూదు లను సంతోషపెట్టాలన్న తలంపుతో యాకోబును ఖడ్గముతో చంపించి పేతురుని కూడా చంపించాలను కున్నాడు. అయితే చెరలోనున్న పేతురు ఆశ్చర్యకరమైన రీతిలో చెర నుండి తప్పించుకున్నాడు. అప్పుడు యూదయ నుండి సిసా రియా తిరిగి వచ్చిన అగ్రిప్ప చాలా అసహనంగాను, అసహజంగాను కనిపించేవాడు. ప్రభుత్వాధికారుల మీద విసుక్కుంటుండే వాడు.

అనాదిగా పాలస్తీనా నుండి తూరు సీదోనీయులు ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకుంటున్నారు. తూరు సీదోను దేశములు కూడా రోమా సామ్రాజ్యము వారిచే పరిపాలించ బడుచున్నవి. అయితే అక్కడి వర్తకులు సుంకము చెల్లించ కుండా, దొంగతనంగా వ్యాపారం చేస్తున్నారు. ఈ సంగ తులు హేరోదు దృష్టికి వచ్చినప్పుడు తూరు, సీదోనీయులకు భవిష్యత్తులో ధాన్య ఎగుమతి నిషేదించబడినది. ఇది తెలుసుకున్న తూరు, సీదోనీయులు సిసారియా పట్టణము నకు వచ్చి అగ్రిప్ప అంతఃపురమునకు గృహనిర్వాహకుడగు బ్లాస్తుకు లంచం ఇచ్చి పై చట్టం రద్దు చేయించదలచారు.

అదే సమయంలో క్లౌదియ చక్రవర్తి మెప్పుకోసం అగ్రిప్ప రాజు సిసారియాలో అంతర్జాతీయ క్రీడలు ప్రారంభించి, ఆటల మొదటి రోజున క్లౌదియ చక్రవర్తి ఆరోగ్య కోసం అనేక విధాలుగా ప్రార్థనలు ఆచరించారు. రెండవ రోజున ఉదయాన్నే వెండిజరీతో నేయబడిన రాజ వస్త్రములు

ధరించి క్రీడా ప్రాంగణమునకు వచ్చి పడమట వేదిక మీద ఆశీనుడయ్యాడు. సభలో ఆయనను పొగిడే హేరోదీయులు ఉన్నారు. సూర్యోదయమైనప్పుడు కిరణాలు ఆయన మీద పడినప్పుడు ఆయన వస్త్రాలు ధగధగ మెరిశాయి. అంతట హేరోదీయులు ఉద్దేశ్యపూర్వకంగానే అగ్రిప్ప దేవుడే, అగ్రిప్ప దేవుడే అని అరవడం మొదలుపెట్టారు. కొంతమందైతే ఆయనకు ప్రార్థనలు చెయ్యటం ప్రారంభించారు.

అగ్రిప్ప వారిని నివారించలేదు. కాని తన పీఠమునకు ఎదురుగా ఎత్తుగా తీగమీద ఒక గుడ్లగూబ ఉండటం చూచి అది దుష్టశకునంగా భావించి భయపడ్డాడు. అంతే, కొంచెంసేపటిలో అతని శరీరంలో అన్నీ భాగాల లోపల నుండి మంటలు ప్రారంభమయ్యాయి. అక్కడే కుప్ప కూలి పోయాడు. ఆ రోజు నుండి నేటికి అయిదు రోజులు భరించలేని శరీర బాధలతో, తన శరీరమంతా పురుగులు ప్రాకుతున్న భావనతో మరణించాడు అని ముగించాడు.

బర్నబా సౌలువైపు చూశాడు. తర్వాత కొర్నేలివైపు చూచి "క్రైస్తవ్యమునకు గొడ్డలిపెట్టు అనుకున్న అగ్రిప్ప కథ ఇంత హృదయవిదారకంగా ముగిసింది" అని "అగ్రిప్ప కుమారుడు ఇప్పుడు ఎక్కడ ఉన్నాడు?" అని అడిగాడు.

"అతని పేరు కూడా అగ్రిప్ప హేరోదు, అతని వయస్సు ఇప్పుడు పదిహేడు సంవత్సరాలు. రోమా పట్టణములో పరిపాలన పద్ధతిలో శిక్షణ పొందుతున్నాడు. అతని చెల్లెలు బెర్నైకా కూడా రోమాలోనే ఉన్నది. ఆమె వయస్సు పదహారు సంవత్సరాలు" అన్నాడు కొర్నేలి.

ఆ మరునాడు బర్నబా, సౌలు, మార్కు ఓడ ఎక్కి అంతియొకయకు ప్రయాణమయ్యారు. అంతియొకయ చేరిన మార్కుకు అంతా క్రొత్తగాను, ఇబ్బందికరంగాను అనిపించింది. ఇక్కడ శిష్యులలో ఎక్కువమంది అన్య జనాంగాలలో నుండి వచ్చిన వారే. పారంపర్యాచారములు వీరికి తెలియవు. తెలిసినా పట్టించుకోరు. ప్రతి సోమవారం, గురువారం సమాజమందిరములో జరిగే ప్రార్థనా కూటములు ప్రవక్తలైన సుమియోను, లూకియ, మనయేసులు సంఘమంతటినీ నడిపించేవారు. ఆ రెండు దినములు ఎక్కువ మంది ఉపవాసము ఉండేవారు.

ప్రవక్తయైన మనయేసు ఎక్కువ చదివిన వాడు. ఆయన తల్లి హేరోదు అంతిపాకు దాదియై పెంచినది. మనయేసు, అంతిపా సమ వయస్కుడైనందున తల్లిపాలను అంతిపాతో పంచుకొనే వాడు. ఇతను చిన్నవయస్సునందే ప్రవచించే వాడు. ఆ వయస్సులో మహా హేరోదు కుమారులందరి లోను అంతిపా రాజవుతాడని ప్రవచించాడు. హేరోదు అంతిపా రాజైన తర్వాత తన ఆస్థానములో గొప్ప హోదా కలుగజేశాడు. మనయేసు ప్రభువును వెంబడించిన తర్వాత అంతియొకయలో గొప్ప సేవలో పాల్గొన్నాడు. ఒక సోమ వారం ప్రార్థన కూటములో మనయేసు నిలబడి, "నేను బర్నబాను సౌలును పిలిచిన పనికొరకు వారిని నాకు ప్రత్యేకపరచుడి" అని ప్రవచించాడు.

బర్నబా సభ ఏర్పాటు చేసి, తర్వాత కార్యక్రమము విషయం ఉపవాస ప్రార్థన మొదలుపెట్టారు. తర్వాత రెండు రోజులకు బర్నబా, సౌలు, మార్కు ప్రయాణమునకు సిద్ధ పడ్డారు.

ఉదయాన్నే సెలూకయకు గుఱ్ఱపుబగ్గీ సిద్ధమయ్యింది. బర్నబా ఓడ పైభాగమున అడ్డంగా బిగించిన ఇనుప గొట్టానికి ఆనుకుని తూర్పువైపుగా చూస్తున్నాడు. సగం చీకటి, సగం వెలుతురు, వెలుతురు కూడా బూడిద రంగులో ఉంది. సముద్రం సీసంలాగ నిశ్చలంగా ఉంది. నీళ్ళని చీల్చుకొని వెళ్తున్న ఓడ శబ్దం తప్ప ఇంక ఏమి వినబడటం లేదు. తూర్పువైపు నుండి పడమరవైపుగా చూశాడు. ఎదురుగా సముద్రములోనికి చొచ్చుకొని వెళ్ళిన కుప్ర. సముద్రంలో నుండి లేచిన తిమింగళంలో ఒక భాగంలా ఉంది. అప్పటికి మాయమౌతున్న చుక్కలు అరుదెంచే సూర్యునికి స్వాగతం పలుకుతున్నట్లుగా ఉన్నాయి.

తను ఏ గడ్డ మీద అయితే జన్మించాడో ఆ గడ్డ మీదే విదేశీ దండయాత్ర చెయ్యబోతున్నాడు. దేవుడు తనకు సౌలును,మార్కును తోడుగా ఇచ్చాడు. ఇంతవరకు చేసిన సేవ ఒక ఎత్తు, ఎప్పుడు మొదలు పెడుతున్న సేవ దేవుని నడిపింపుతోనే. **(సశేషం)**

# ఆల్బర్ట్



## (లియో టాల్‌స్టాయ్)

రష్యాలోని పీటర్స్‌బర్గ్‌లో ఉన్న ఓ చిన్న పార్కులోకి అయిదుగురు యౌవనస్తులు సంతోషంగా గడపటానికి ఉదయం రెండు గంటలకు వచ్చారు.

అక్కడ చేరిన వారందరూ యవ్వనస్తులే. చాలా షాంపేన్ త్రాగారు. పియోనో, వయెలిన్ మరికొన్ని వాయిద్యాలు వాయిస్తూ చక్కగా నాట్యం చేస్తున్నారు. ఉండేకొద్ది స్వరము హెచ్చుస్థాయికి వస్తోంది. అయినప్పటికీ వారు కోరుకున్న స్థాయిలో వారికి ఉత్సాహము కలుగలేదు. ఏదో వెలితి కనబడుతుంది.

వారంతా దేనికోసమో ప్రయత్నిస్తున్నారనిపిస్తుంది. ఆ సంతోషం పొందటానికి బలవంతంగా ప్రయత్నిస్తుడడం మరి ఎక్కువ విసుకు పుట్టిస్తుంది. ఈ అయిదుగురు యువకులలో ఒకనికి తన మీద తనకే విసుకు, తన ప్రక్కనున్న వారితో విసుకు! అసలు ఆ పార్టీ మొత్తం విసుకు పుట్టిస్తోంది. విసుకుగా లేచి తన టోపి లాక్కుని తలపై పెట్టుకొని ఇంటికి వెళ్ళిపోవాలనే ఉద్దేశ్యం కలవానివలె బయలుదేరాడు. బయటకు వస్తుంటే ప్రక్కగదిలో నుండి ఇద్దరు వాదులాడుకోవడం వినిపించి, ఆగి వినసాగాడు.

'నీవు రాలేవు, అక్కడ అతిథులున్నారు' అని అంటుంది ఒక స్త్రీ గొంతు. 'దయచేసి నన్ను లోపలికి రానివ్వు, నేను బాగానే ఉన్నాను' అంటుంది బ్రతిమిలాడినట్లు బలహీనంగా ఒక మగగొంతు.

'అమ్మగారి సెలవులేనిదే నేను నిన్ను లోపలికి రానివ్వను' అన్నది ఆ స్త్రీ. 'నువ్వు ఎక్కడికి వెళ్తున్నావు? ఏం మనిషివయ్యా నువ్వు!' అన్నది.

తలుపు పెద్ద శబ్దంతో తెరుచుకొని ఓ ప్రత్యేకంగా కనబడే మనిషి, వాకిట్లో నిలుచున్నాడు, భయపడుతూ వంగి నమస్కరించినట్లు. చిన్న కోటు వేసుకొని వున్నాడు. తల దువ్వుకోలేదు. పెద్దగా ఎత్తులేదు. అతడు ధరించిన చొక్కా మాసిపోయినట్లుగా కోటు లోపల నుండి కనబడుతుంది. అతని వస్త్రధారణ ఎలా ఉన్నా, అతని ముఖం మృదువుగా ఉన్నది. అతని గడ్డం మీద చర్మము మెరుస్తుంది. మాసిపోయిన బూట్లు ధరించి వున్నాడు. కొంచెం భయపడుతున్నట్లు కనిపించినా వెంటనే రెండు అడుగులు ముందుకు వేసి ప్రక్కనున్న యవ్వనస్తుని చూసి నవ్వాడు. ఆలోచించకుండా ఆ యవ్వనస్తుడు కూడా నవ్వాడు.

'అతను ఎవరు?' అని మెల్లగా అక్కడి పనివాడిని అడిగాడు ఆ క్రొత్తవ్యక్తి.

ప్రక్క తలుపు తీసుకొని లోపలికి వెళ్ళినపుడు లోపల నుండి సంగీతం వినబడింది.

ఇతను ఒక విలువైన సంగీతకారుడు. అప్పుడప్పుడు యజమానురాలిని చూడడానికి వస్తుంటాడు. డెలినోవ్ నువ్వు ఎక్కడున్నాడు? అని బయట నుండి ఎవరో అడిగారు. డెలినోవ్ అనే యవ్వనస్తుడు వెంటనే డ్యాన్స్ రూం లోపలికి వెళ్ళాడు.

ఆ వాయిద్యకారుడు వాకిట్లో నిలుచుని కాళ్ళతో చిన్నగా కొడుతూ లోపల డ్యాన్స్ చేస్తున్న వారిని చూస్తున్నాడు.

'రా! వచ్చి నీవు కూడా చెయ్యరాదా!' అంటూ వెళ్ళాడు ఒక ఆహ్వానితుడు. వాయిద్యకారుడు ప్రశ్నార్థకంగా యజమానురాలి వైపు చూచాడు. వెళ్ళు, వెళ్ళు అవతల అతను నిన్ను ఆహ్వానిస్తున్నాడు కదా అన్నది. వెంటనే ఆ వాయిద్యకారుడు కొంచెం ముందుకు వెళ్ళి డ్యాన్సు చేస్తున్నాడు. ఆ ప్రక్కన కూర్చున్న పెద్దాయన డ్యాన్సు చేస్తూ వాయిద్యకారుని మీదకు వచ్చాడు. వాయిద్యకారుడు అనుకోని ఈ సంఘటనకు నాలుగయిదుసార్లు తూలిపోతూ చివరికి మధ్యలో వెల్లకిలా పడిపోయాడు. చాలామంది ఆ పరిస్థితి చూసి పెద్దగా నవ్వసాగారు. అయితే అతను లేచి నిలుచోలేదు. అతనిని డ్యాన్సుకు ఆహ్వానించిన వాడు చూస్తూ నిలబడిపోయాడు. సంగీతము ఆగిపోయింది.

డెలినోవ్, యజమానురాలు మొదటిగా పరుగెత్తి పడిపోయిన అతని దగ్గరకు వెళ్ళారు. క్రిందపడినవారు కుడి మోచేతి మీద ఆనుకొని నేలవైపు చూస్తూ ఉన్నాడు.

అప్పుడు అతనిని లేపి కుర్చీలో కూర్చుండబెట్టారు. ఆ పడినవాడు తన ముఖం మీద పడిన వెంట్రుకలను తల మీదకు లేపుకొని నవ్వుతూ వారడిగిన ప్రశ్నలకు జవాబు లివ్వలేదు. ఆల్బర్టుగారు! ఆల్బర్టుగారు! మీకేమైనా దెబ్బలు తగిలాయా? నేను చెప్పాను, మీరు చాలా బలహీనంగా ఉన్నారు, డ్యాన్సు చెయ్యవద్దన్నాను. మరలా చుట్టూ ఉన్నవారిని చూస్తూ–ఈయన నడువలేదు, ఇక డ్యాన్స్ ఎలా చేస్తాడు? అన్నది. ఈయన ఎవరు? అని ఎవరో అడిగారు.

ఒక ఆర్టిస్టు. బీదవాడు, అయితే చాలామంచివాడు. జాలినొందదగినవాడు, మీరు చూస్తున్నారుగా! అన్నది యజమానురాలు.

ఏమీ పరవాలేదు – అంటూ కొంచెం కష్టంగానే లేచి నిలుచున్నాడు. తనకు ఏమీ జరగలేదని నిరూపించుకోవ డానికి అన్నట్లుగా జనం మధ్యలోకి గబగబ వెళ్తూ మరలా తూలిపోయాడు. ప్రక్కనున్నవారు పట్టుకోకపోతే మళ్ళీ క్రింద పడిపోయేవాడే! అతన్ని చూస్తూ అందరూ – నిశ్శబ్దమై పోయారు. అతని కళ్ళు నీరసమయినట్లుగా అనిపించినవి.

అతను తన మోకాలును రుద్దుకొని ఏమి పరవాలేదు, అంతా బాగున్నది అని వయెలిన్ పట్టుకొనివున్న వ్యక్తి వద్ద నుండి వయెలిన్ తన చేతిలోకి తీసుకొని – ఇక మనం కొంచెం సంగీత సాధన చేద్దాము అన్నాడు.

ఇతను ఓ ప్రత్యేకమైన మనిషి అంటున్నారు ఒకరు. మరొకరు మంచి సంగీత జ్ఞానము ఇతనిలో ఉండినా అది పాడైపోతుంది అన్నారు. అతన్ని చూస్తుంటే జాలివేస్తుంది అన్నారు మరొకరు. అతని ముఖం ఎంత అందంగా ఉందో చూడండి అన్నాడు డెలినోవ్. ఇవేమి పట్టించుకోకుండా అల్బర్టు లేచి నిలుచుని వయెలిన్ తన రొమ్మున ఆనించు కొని పియానో వాయించే అతని దగ్గరకు వెళ్ళి ఒక రాగం చెప్పి తను అదే వాయించ మొదలుపెట్టాడు.

ఆల్బర్ట్ తన చేతి సన్నని వేళ్ళు వయెలిన్ క్రింది భాగంలో కదిలిస్తూ క్రింద నుండి పైకి నడిపిస్తుంటే ఏవేవో మాటలు వినిపించసాగాయి. కుడిచేతిలోని వాయిద్యాన్ని ముందుకు వెనుకకు లాగినపుడు ఏవో ఆలాపనలు వస్తున్నాయి. ఉండేకొలది వేగం పుంచుకుంటుంది. వింటున్న వారందరు చిన్నగా తమ బాల్యంలోకి ప్రవేశించి, జ్ఞాపకాలతో యవ్వనం లోకి ప్రవేశించి, వాయిద్యము వారిని నడిపించే కొలది మధురాను భూతులను అనుభవించసాగారు.

ఆల్బర్టు కళ్ళు మెరుస్తున్నాయి. అవి కొంచెం మూతపడి నట్లు, నోరు సగం తెరుచుకొని నిలుచున్నాడు. అలానే నిలబడిపోయాడు. తన్మయత్వముతో వయెలిన్ వాయించ సాగాడు. వింటున్నవారు ఎవరికి వారే ఒంటరిగా ఉన్నట్లుగా అనుభవములోనికి వెళ్ళారు.

డెలినోవ్ తన్మయుడైపోయాడు. తను కూర్చున్న చోటున కళ్ళు మూసుకున్నాడు. అతని తొలిప్రేమలోకి నడిచాడు. తను ప్రేమించిన మల్లికను మొట్టమొదటిసారి ముద్దు పెట్టుకున్నప్పుడు కలిగిన తన్మయత్వం ఇప్పుడు మళ్ళీ అనుభవములోనికి వచ్చింది. ఆ అనుభవాలు మళ్ళీ తన జీవితంలోకి రావని భావించాడు. కాని ఆల్బర్టు నైపుణ్యం తననే ఆ మధురానుభూతిలోనికి లాక్కెళ్ళింది. ఇప్పుడు ఆల్బర్టు వాయిస్తున్న పాట అందరికి తెలిసినదే. నాకయితే అనుభవములోనికి మళ్ళీ తిరిగిరాని అనుభవాలే ఇప్పుడు నన్ను అలరిస్తున్నాయి అని పాడుతున్నాడు. నాకు తిరిగిరాని అనుభవాలే ఇప్పటి నా అనుభవాల ఆలంబన అని అంటున్నాడు డెలినోవ్. తనను ఉద్దేశించి ఆల్బర్టు వాయి ద్యాలు నేర్చుకొని ఇతరులకు నేర్పాడు అనిపించింది.

ఆల్బర్టు వాయించడం ఆపినపుడు అక్కడి వారందరు చాలా దూర ప్రయాణం చేసి వచ్చిన వారివలె ప్రక్కన కూలబడ్డారు. ఆల్బర్టు ఆపినప్పుడు అందరి కళ్ళు అతని మీదకు త్రిప్పారు. మరలా ఈ ప్రపంచములోనికి వచ్చామే అని ఆశ్చర్యపోయారు. ఏదో చెప్పాలని అందరు తాపత్రయ పడుతున్నారు. కాని ఏమి చెప్పాలో వారెవరికి అర్థం కాలేదు. ఎంత కమ్మగా వాయించాడు అన్నారు. కుర్చీలో కూర్చున్న ఓ ఆఫీసరు నీవు అలసిపోయావా? అని అతని ప్రక్కన కూర్చున్న స్త్రీ ఆల్బర్టును అడిగింది. వండర్‌ఫుల్ అన్నాడు డెలినోవ్. తన చేతి నొసలు తుడుచుకుంటూ ఇక వెళ్దాము పదండి అని సోఫాలో పండుకొనిన ఓ వ్యక్తి – అతనికి ఏమైనా ఇవ్వడానికి చందా పడదాము అని చందా పట్టగా వచ్చిన డబ్బును డెలినోవ్ ఆల్బర్టుకిచ్చి తర్వాత వెళ్ళి తన కుర్చీలో కూర్చుని ఆలోచించసాగాడు.

**(సశేషం)**

సాక్ష్యము

# నా ప్రభువును నేను వదల్లేదు

నా పేరు శ్రీ విద్య. నేను హిందూ కుటుంబంలో జన్మించాను. మా తల్లిదండ్రులు ఉద్యోగరీత్యా ఒంగోలులో ఉంటున్నారు. నాకు ఒక చెల్లెలు ఉంది. నేను మద్రాసులో జె.ఎ. ఇంజనీరింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం చదివే టప్పుడు నా ప్రభువు నన్ను ఆకర్షించుకున్నాడు.

నేను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదివేటప్పుడు రేడియోలో దేవుని వాక్యం వింటుండేదానను. అప్పటికి నాకు యేసయ్యను గురించిగానీ, క్రైస్తవమతం గురించి గానీ ఏమీ తెలియదు. అయితే రేడియోలో వాక్యం వినేటప్పుడు నాకు క్రొత్తగా అనిపించి ఇంకా తెలుసుకొవాలనే కుతూహలం కలిగింది. అప్పుడు క్రైస్తవురాలైన నా క్లాస్‌మేట్ ఒకమ్మాయిని అడిగాను నేను క్రైస్తవ మతంలోకి మారవచ్చా? అని. అప్పుడు ఆ అమ్మయి మీ తల్లిదండ్రులకు ఏమీ అభ్యంతరంలేదా? అని అడిగింది. అప్పుడు "నేను వారికి అభ్యంతరమైన సరే నేను మారతాను" అన్నాను. ఆ మాట నా ప్రమేయం లేకుండా అన్నాను. "ఒకవేళ నేను యేసయ్యను నమ్ముకున్నా, హిందూ పూజలు అవీ చేయవచ్చా?" అని అడిగాను. అప్పుడు ఆ అమ్మాయి "చల్లగా అన్నా వుండు లేదా వెచ్చగా అన్నా ఉండు, నులివెచ్చగా ఉండవద్దు అని యేసయ్య చెప్పాడు" అని చెప్పింది.

తర్వాత ఇంకెప్పుడూ దాని గురించి ఆలోచించలేదు. మళ్ళీ రేడియోలో వాక్యం వినలేదు. యేసయ్యను గురించి ఆలోచించలేదు. ఇంటర్మీడియట్ పాసయ్యాక నేను బి.ఐ.టి మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సులో చేరాను. కానీ ఆ కోర్సుకు విలువలేదని తెలిసి చాలా బాధపడి ఏంచెయ్యాలో తెలియని పరిస్థితిలో ఉనప్పుడు దేవుడు ఒక వ్యక్తి ద్వారా నన్ను ఇంజనీరింగ్ చదవటానికి మార్గం ఏర్పరచాడు.

నేను మద్రాసులో ఒక క్రైస్తవ ఇంజనీరింగ్ కాలేజీలో చేరాను. వేరే కాలేజీలో ఎక్కడా సీట్లు దొరకక తప్పనిసరి పరిస్థితుల్లో ఆ కాలేజీలో చేరాల్సి వచ్చింది. అది క్రైస్తవ కాలేజీ కావడం వల్ల నాకు క్రైస్తవ స్నేహితులు ఏర్పడ్డారు. వారి వల్ల నేను యేసయ్యను గురించి ఎక్కువగా తెలుసుకో గలిగాను. యేసయ్య వారి జీవితాలలో చేసిన ఆశ్చర్య కార్యాలను నాతో పంచుకొన్నప్పుడు నేను చాలా ఆశ్చర్య పోయాను. ముందు నమ్మలేదు, తర్వాత వారిని బాగా పరిశీలించాను. చిన్నఅబద్ధం చెప్పటానికి కూడా వారు వెనుకాడటం ఇతరుల గురించి ప్రార్థించడం, ఇతరులను ప్రేమించడం నన్ను ఆకర్షించాయి. నేను కూడా క్రైస్తవురాలిగా వుండాలని ఆశపడేదానను. తర్వాత వారు అన్యుల గురించి, వారు యేసయ్యను నమ్ముకొన్న తర్వాత వారు ఎదుర్కొన్న సమస్యలు, కష్టాలు, చెప్పేవారు. అలాంటి సమయాల్లో కూడా వారు యేసయ్యను విడువకుండా ఆయన కొరకు అన్నింటిని భరించిన విధం నాతో పంచుకొన్నప్పుడు నేను కూడా అలా ఉండాలని గట్టిగా నిశ్చయించుకొన్నాను. యేసయ్యను నా స్వంత రక్షకునిగా అంగీకరించాను. ప్రతి ఆదివారం నా స్నేహితులతో కలిసి చర్చికి వెళ్తుండేదానను. వారితో కలిసి హాస్టల్లో ప్రార్థిస్తుండేదానను. ఇదంతా మా ఇంట్లో ఎవరికీ తెలియదు.

సెలవులలో నేను ఇంటికి వెళ్ళినప్పుడు మా నాన్న నన్ను అడిగాడు "ఏమ్మా, హనుమాన్ చాలిసా చదువుతున్నావా?" అని. అప్పుడు నేను "చదవడం లేదు" అని చెప్పాను."అయితే వెళ్ళి చదువుకో" అన్నాడు. మా నాన్నకి ఎదురు చెప్పడం ఇష్టం లేక పూజ గదిలోకి వెళ్ళి చదవటానికి ప్రయత్నించాను కాని నేను చదవలేకపోయాను. మానాన్న నా ప్రక్కనే ఉన్నాడు. విగ్రహారాధన చేయకూడదని దేవుడు చెప్పిన విషయం గర్తుకు వచ్చింది. "నేను చదవను నాన్న" అని చెప్పి ప్రక్కకు వచ్చేశాను. చదవమని బ్రతిమలాడాడు. కానీ నేను చదవలేదు. మా నాన్న నాతో మాట్లడటం మానేశాడు నేను వారి ఎదురుగానే యేసయ్యకు ప్రార్థించేదానను. అప్పుడు మా అమ్మ నా దగ్గరకు వచ్చి యేసయ్యను ప్రార్థించ

వద్దని ఏడ్చేది. అందరూ దేవుళ్ళే యేసయ్యను మాత్రమే ప్రార్థించవద్దు" అని చెప్పేది.

మా అమ్మ ఆరు, ఏడు సంవత్సరాల నుండి మానసికమైన రుగ్మతతో బాధపడుతుండేది. మేము ఎన్నో హాస్పిటల్స్‌లో చూపించాము. అయినా బాగు కాలేదు. అప్పుడు అది ఒక జబ్బు అనుకున్నాను. అయితే మా అమ్మ నా దగ్గర వచ్చి ఏడ్చి ప్రార్థించవద్దు" అన్నప్పుడు ఆమె అపవిత్రాత్మ కలిగి వున్నట్లుగా అనిపించింది. అప్పటి నుండి ఆమె కోసం ప్రార్థించసాగాను.

ఒకరోజు మా నాన్న వచ్చి "యేసయ్యను గురించి నేను కూడా విన్నాను, ఆయన చాలామందిని స్వస్థపరిచాడని. అయితే ఇది ఒకప్పుడు ఇప్పుడు ఈ కాలంలో కూడా స్వస్థత జరిగితే నమ్మవచ్చు. మీ అమ్మని యేసయ్య ఒకనెలలోపు బాగుచేస్తే మేము కూడా ఆయను నమ్ముతాము. ఒకవేళ అలా బాగుకాని పక్షంలో నువ్వు దేవున్ని వదిలిపెట్టాలి" అని నాతో ఛాలెంజ్ చేశాడు. అందుకు నేను ఒప్పుకున్నాను. అయితే నెల రోజుల తర్వాత మా అమ్మకు స్వస్థత జరగలేదు. ఆఖరిరోజు రాత్రి ఎనిమిది గంటలకు మా నాన్న నాకు ఫోన్ చేసి "చెప్పిన సమయంలోపు మీ అమ్మకి బాగుకాలేదు. కాబట్టి నువ్వు ఇచ్చిన మాట ప్రకారం యేసయ్యని వదిలేయాలి" అన్నాడు. అప్పుడు నేను నా మాటైన తప్పుతాను గాని దేవుణ్ణి వదలను" అన్నాను. అందుకు మానాన్న "మాట మీద నిలబడలేని దానివి నువ్వేం చేస్తావు? దేవుడు నీ ప్రార్థన ఏం వింటాడు? అన్నాడు. కాని నాకు ఇంకా విశ్వాసం వుంది. ఆ రోజు గడవటానికి ఇంకా నాలుగు గంటలు సమయం వుంది కదా! ఈ లోపు దేవుడు స్వస్థపరచకపోతాడా? అనుకున్నాను. అప్పుడు నేను దేవునికి ప్రార్థించాను" యేసయ్య ఈ విషయం అందరికీ తెలుసు, ఇప్పుడు స్వస్థత జరగకపోతే అందరూ దేవుడు ఏమీ చేయలేదనుకుంటారు. కాబట్టిఅందరూఆశ్చర్యపోయే రీతిలో మా అమ్మకి స్వస్థత చేసి అద్భుతకార్యం జరిగించమ"ని ప్రార్థించాను. తరువాత రోజు ఇంటికి ఫోన్‌చేసి అమ్మకి బాగయిందా? అని అడిగితే "బాగు కాలేదు" అని చెప్పారు. నేను చాలా బాధపడ్డాను. అందరూ వచ్చి అడిగితే నేనేం సమాధనం చెప్పాలో నాకు అర్థం కాలేదు. నేను చాలా ఏడ్చాను. నా గురించి నేను అడగలేదు. అందరూ తెలుసుకొనేలా అద్భుతకార్యం జరగ లేదని చాలా బాధపడ్డాను. అంతేకాక నేను కాలేజిలో మొదటి సంవత్సరంలో ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయ్యాను. అప్పుడు కూడా మానాన్న "నువ్వు యేసయ్యను నమ్ముకున్నావు కాదా! ఆయన నిన్ను పాస్ చేయించలేకపోయాడా?" అని దెప్పిపొడుపుగా అన్నాడు. అయినప్పటికి యేసయ్య మీద నాకున్న విశ్వాసం సడలలేదు. దేవుడు అన్నీ నా మంచికే చేసివుంటాడనుకున్నాను.

నేను సెలవలకు మరలా ఇంటికి వెళ్ళాల్సి వచ్చింది. వాళ్ళు నన్ను అడిగినప్పుడు నేను వారికి ఎలా సమాధానం చెప్పాలో సిద్ధపడ్డాను. నేను వారితో దేవుని వాక్యం పంచుకో వాలనున్నాను. నేను వారిని ఎంతో బ్రతిమాలి వాక్యం వినమని చెప్పేదానను. మానాన్న విన్నప్పటికీ "ఇవన్నీ నాకు తెలుసు నేను ఎప్పుడో విన్నాను" అంటుండేవాడు. నేను మరలా కాలేజీకి వచ్చినప్పుడు అక్కడ దేవుని కూటము జరుగుతుందని తెలిసి నేను వెళ్ళాలనుకున్నాను. కానీ హాస్టల్‌కి వెళ్తే త్వరగా వెళ్ళలేనని తెలిసి నేరుగా కూటము దగ్గరకు వెళ్ళాను. అప్పుడు మా నాన్న హాస్టల్‌కి ఫోన్ చేసినప్పుడు నేను హాస్టల్లో లేనని తెలిసి వచ్చి చదువు మాన్పించి ఇంటికి తీసుకువెళ్ళారు. నేను ఆ కాలేజీలో, హాస్టల్లో ఉంటే స్నేహితులతో కలిసి చర్చికి, దేవుని కూటాలకు వెళ్తానని కాలేజి మాన్పించాలని చూశారు. కాని కుదర్లేదు. అందుకని నాకు పెళ్ళి చెయాలని నిర్ణయించుకున్నారు. అది కూడ కుదర్లేదు. వారు నా గురించి ఎంతో డబ్బు ఖర్చుచేసి నన్ను చదివించాలనుకున్నప్పుడు వారి ఎదురుగా ఉండి వాళ్ళను బాధపెట్టడం ఇష్టంలేక నేను చర్చికి వెళ్ళను, కాలేజికి వెళ్ళి చదువుకుంటాను" అని నేను మరలా కాలేజీకి వచ్చాను. చర్చికి వెళ్ళకండా ఉన్నంత మాత్రాన దేవుడు నాకు దూరం కాడు. నా హృదయంలో నుండి ఆయనను ఏ పరిస్థితులూ తీసివేయలేవు అని నిశ్చయించుకున్నాను. తర్వాత నేను అప్పుడప్పుడూ చర్చికి వెళ్తుండేదాన్ని. ప్రతి ఆదివారం ఉదయం 7-30 గంటలకి మా నాన్న ఫోన్ చేసేవాడు. వాళ్ళు ఫోన్ చేసిన తర్వత చర్చికి వెళ్ళేదానను. కానీ మా అమ్మ ఒక విషయం చెప్పడం మర్చిపోయి మళ్ళీ తొమ్మిది గంటలకి ఫోన్ చేసింది. అలా నేను వారికి తెలియకుండా

చర్చికి వెళ్తున్నాని తెలిసింది వాళ్ళు మళ్ళీ కాలేజి మాన్పించాలని చూశారు కానీ జరగలేదు. మళ్ళీ నేను శెలవులకు ఇంటికి వెళ్ళినప్పుడు మా నాన్న "ఎందుకు ఇలా చేస్తున్నావు? తల్లిదండ్రులను ఎందుకిలా బాధ పెడుతున్నావు? అది పాపం అని ఏడ్చాడు. అప్పుడు నేను "మన కుటుంబానికి శాంతి యేసయ్యలో మాత్రమే ఉందని నమ్మి ఇదంతా చేస్తున్నాను. మీకు ఈ విషయం ఇప్పుడు అర్థం కాదు. ఒక రోజు తెలుస్తుంది" అని చెప్పాను. మా నాన్న ఎప్పుడు ఏడ్వడం చూడలేదు. కానీ నా విషయం ఏడ్చి 'మమ్మల్ని ఇలా కష్టపట్టకు' అన్నప్పుడు నేను చాలా గాయపడ్డాను. అప్పుడు నేను వాళ్ళని మళ్ళీ సమాధానపరిచి "నేనలా చెయ్యను, మనమందరం బాగుండాలనే చేశాను" అన్నాను. అప్పుడు మానాన్న "నువ్వు అన్నీ మర్చిపోయి బాగా చదువుకో, మీ అమ్మను నేను బాగుచేయిస్తాను." అన్నాడు. అది మా నాన్న చేయలేడని తెలిసినా "సరే!"అని అన్నాను. ఇప్పుడు నేను ఒక రహస్య క్రైస్తవురాలిగా ఉంటున్నాను. నేను మా చెల్లికి కూడా సువార్త చెప్పాను. తను కూడా యేసయ్యను నమ్ముకుంది. కాని ఇంట్లో ఉండే ఒత్తిడి అశాంతి కారణంగా తను కూడా రహస్య క్రైస్తవురాలిగానే ఉంది. నేను యేసయ్యని గూర్చి తెలుసుకోక ముందు నాకు ప్రేమబంధం అంటే తెలీదు. ఇతరులు నా ఎదుట ఎంత బాధపడుతున్నా నాకు కనీసం చీమకుట్టినట్టుగా కూడా ఉండేది కాదు. చాలా కఠిన హృదయం నాది. యేసయ్యను నమ్ముకున్న తర్వాత నేను పూర్తిగా మారిపోయాను. దేవుని ప్రేమతో నింపబడ్డాను. ఇప్పుడు నేను పదిమందికి దేవుని ప్రేమ పంచగలను. ఇతరులు మారునట్లుగా ప్రేమించగలను. దేవుడిచ్చే శాంతి, ప్రేమ, సంతోషం ముందు నేను ఎదుర్కోనే సమస్యలు ఏవీ పెద్దవి కావు. ఎటువంటి కష్టమైన స్థితిలోనైనా ఆయనను విడువకుండా ఉండునట్టి బలమైన విశ్వాసం దేవుడు నాకు ఇచ్చాడు. దేవుడు నాకు నా కుటుంబ విషయంలో వాగ్దానం చేశాడు (యిర్మియా 31:16). కాలేజీలోను, హాస్టల్లోనూ అయన మహిమార్థం నన్ను వాడుకున్నాడు. నా కష్టాల్లో, సమస్యలలో, బాధలలో నేను ఎప్పుడూ వదల్లేదు. నా కొరకు ప్రార్థించండి.

**బైబిలును గురించిన కొన్ని విషయాలు.....**

| | | |
|---|---|---|
| **పుస్తకములు** | **:** | **66** |
| పాతనిబంధన | : | 39 |
| క్రొత్తనిబంధన | : | 27 |
| **అధ్యాయములు** | **:** | **1189** |
| పాతనిబంధన | : | 929 |
| క్రొత్తనిబంధన | : | 260 |
| **వచనములు** | **:** | **31084** |
| పాతనిబంధన | : | 23129 |
| క్రొత్తనిబంధన | : | 7955 |
| పెద్ద పుస్తకము (పా.ని.) | : | కీర్తనలు |
| చిన్నపుస్తకము(పా.ని.) | : | ఓబద్య |
| పెద్ద పుస్తకము(క్రొ.ని.) | : | లూకా |
| చిన్నపుస్తకము(క్రొ.ని.) | : | 2యోహాను |
| పెద్ద అధ్యాయము | : | కీర్తనలు 119 |
| చిన్న అధ్యాయము | : | కీర్తనలు 117 |
| పెద్ద వచనము | : | ఎస్తేరు 8:9 |
| చిన్న వచనము | : | 1థెస్సలొనీక. 5:19 |

(ఆత్మను ఆర్పకుడి) ఇంగ్లీషు బైబిల్లో (యోహాను 11:35 Jesus wept)

| | | |
|---|---|---|
| వ్రాసిన భాషలు | : | హెబ్రూ, గ్రీకు, అరమిక్ |
| మధ్య వచనము | : | కీర్తనలు 118:8 |
| తర్జుమా చేయబడినది | : | 2,454 భాషలలోకి |
| వ్రాయబడిన కాలము | : | 1,500 సంవత్సరాలు |
| వ్రాసిన వారు | : | 40 మంది |
| ముద్రణ | : | 1455లో జాన్‌గూటెన్‌బర్గ్ |

అచ్చుయంత్రము కనిపెట్టిన తర్వాత మొట్టమొదట ముద్రించబడిన పుస్తకము బైబిల్. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక బాషలలో ముద్రింపబడి, అత్యధిక కాపీలు అమ్ముడైన పుస్తకముగా 'బైబిల్' గిన్నిస్ బుక్ ది వరల్డ్ రిక్డార్స్‌లోకి ఎక్కింది. **(అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న బైబిల్‌కి మనం ఇస్తున్న ప్రాధాన్యత ఎంత?)**

# బైబిలు కథలు - నోవహు

పిల్లలూ బాగున్నారా? ప్రతిరోజూ బైబిల్ చదవటం, ప్రార్ధన చేసుకోవడం మర్చిపోవటం లేదుగా. మీరు దేవుని మార్గంలో నడవటం వలన మీకు మంచి భవిష్యత్తును దేవుడు మీకు ఇస్తాడు. మీరు బైబిలంతా తెలుసుకోవాలని మేము కూడా మీకు బైబిలు కథలు చెప్తున్నాము. ఈ నెలలో మనం నోవహు కథ తెలుసుకోబోయే ముందు మనం కొన్ని విషయాలు తెలిసుకుందాము.

ఆదాము హవ్వలు పాపము చేసిన తర్వాత ఏదెనులో నుండి వెలివేయబడతారు కదా! తర్వాత వాళ్ళకి కయీను, హేబేలు పుట్టి, కయీను హేబేలును చంపడం, తర్వాత శాపగ్రస్తుడై దేశ దిమ్మరి అవడం మనం గత నెలలో తెలుసు కున్నాము కదా!




ఆ తర్వాత ఆదాము, హవ్వలకు మరలా ఒక కొడుకు పుడతాడు. అప్పుడు వాళ్ళు అతనికి షేతు అని పేరు పెడతారు. షేతు పుట్టినప్పుడు ఆదాముకు 130 సంవత్స రాలు. తర్వాత ఆదాము 800 సంవత్సరాలు జీవించి కుమారులను కుమార్తెలను కంటాడు. తర్వాత ఆదాము చనిపోతాడు. దేవుని ఆజ్ఞను మీరి వాళ్ళు మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు పండు తిన్నందు వలన దేవుడు చెప్పిన ప్రకారము వారి జీవితాలలో చావు ప్రవేశించింది. కాబట్టి మానవులందరూ ఎప్పుడో ఒకప్పుడు చనిపోవాల్సిందే. ఆదాము పాపము చేసిన తర్వాత భూమి మీద జీవించిన కాలము 930 సంవత్సరాలు.

అలాగే షేతు కూడా 105 సంవత్సరాలు బ్రదికి ఎనోషుని కంటాడు. తర్వాత షేతు 807 సంవత్సరాలు బ్రతికి కుమారులను కుమార్తెలను కన్నాడు. తర్వాత అతను కూడా చనిపోతాడు. షేతు బ్రతికిన కాలము 912 సంవత్స రాలు. ఎనోషు కేయినానును, కేయినాను మహలలేనును, మహలలేలు యెరెదును, యెరెదు హనోకును కంటారు. వీళ్ళంతా సుమారు 900 సంవత్సరాలు జీవించి కుమారు లను కుమార్తెలను కంటూ ఉన్నారు. మరి దేవుడు ఆదాము హవ్వలను ఫలించి, అభివృద్ధి చెంది భూమిని నిండించమని ఆశీర్వదించాడు కదా, అందుకని దేవుడు వాళ్ళకి ఎక్కువ ఆయుష్షును ఇచ్చాడు.

అయితే యెరెదు కుమారు డైన హనోకు మాత్రం చనిపోలేదు. ఎందు కంటే ఆయన భూమి మీద జీవించిన 365 సంవత్సరాలు దేవునికి లోబడి, దేవునితో నడిచాడు. అందుకని దేవుడు అతనిని తీసికొని వెళ్ళాడు. హనోకు కుమారుడైన మెతూషెల భూమీ మీద ఎక్కువ కాలం 969 సంవత్సరాలు జీవించాడు. మెతూషెల కుమారుడు లెమెకు, లెమెకు కుమారుడు నోవహు. నోవహు కుమారులు షేము హాము యాపెతు.

నోవహు కాలములో భూలోకము దేవుని సన్నిధిలో చెడిపోయి యుండెను. భూలోకము బలాత్కారముతో నిండి యుండెను. భూమి మీద మనుష్యులందరూ తమ మార్గము లను చెరిపివేసుకొని దేవునికి అవిధేయులై ఉన్నారు. అప్పుడు దేవుడు నరులను చేసినందుకు బాధపడ్డాడు. అయితే దేవుడు భూమి మీద చూచినప్పుడు నోవహు ఒక్కడే వారిలో నీతిమంతుడుగా కనిపించాడు. నోవహు దేవుని దృష్టియందు కృప పొందిన వాడైయున్నాడు.

అప్పుడు దేవుడు నోవహుతో "సమస్త శరీరుల

మూలముగా భూమి బలాత్కారముతో నిండియున్నది గనుక నా సన్నిధిని వారికి అంతము వచ్చియున్నది. ఇదిగో వారిని భూమితో కూడా నాశనము చేయుదును" అని చెప్పి చితి సారకపు మ్రానుతో నీ కొరకు ఓడను చేసికొనుము. ఆ ఓడ 300 మూరల పొడుగు 50 మూరల వెడల్పు 30 మూరల ఎత్తుతో మూడు అంతస్తులతో ఒక కిటికీ, ఒక తలుపు ఉండేలాగ చేయమని చెప్పాడు. భూమి మీద ఉన్న సమస్త జంతువులు, పక్షులు, ప్రాకు పురుగులలో ఒక ఆడది, ఒక మగది నీ యొక్కకు పంపిస్తాను. వాటిని ఓడలో ఎక్కించి కాపాడాలని, భూమి మీద 40 పగళ్ళు, 40 రాత్రిళ్ళు ప్రచండ వర్షము కురిపించి, నేను చేసిన సమస్త జీవరాసులను తుడిచివేయుదునని దేవుడు నోవహుతో చెప్తాడు. దేవుడు తనతో చెప్పిన ప్రకారము నోవహు ఓడను నిర్మిస్తాడు.

దేవుడు జలప్రవాహములను భూమి మీదకి రప్పించి నప్పుడు నోవహు 600 సంవత్సరముల వయస్సు వచ్చింది. అప్పుడు వాళ్ళు అనగా నోవహు, ఆయన భార్య, ఆయన ముగ్గురు కుమారులు, ముగ్గురు కోడళ్ళు మొత్తం 8 మంది ఓడలోకి వెళ్ళారు. వారితో కూడా దేవుడు చెప్పినట్లు భూమి మీద ఉన్న సమస్త జంతువులు, పక్షులు, ప్రాకు పురుగులలో ఒక ఆడ, మగ జంటలు ఓడలో ప్రవేశించాయి. అంతేకాక పవిత్రమైన జంతువులలో ప్రతిజాతి పోతులు(మగవి) ఏడు, పెంటులు (ఆడవి) ఏడు. అలాగే ఆకాశ పక్షులలో ప్రతిజాతి మగవి ఏడు, ఆడవి ఏడు ఓడలోకి తీసుకురమ్మని చెప్తాడు. తర్వాత ఏడు రోజులకు దేవుడు చెప్పినట్లుగా వర్షం కురవడం ప్రారంభమయ్యింది. అప్పుడు నోవహు యొక్క వయస్సు 600 సంవత్సరం 2వ నెల 17వ దినమున అగాధ జల ముల ఊటలు విడవబడెను, ఆకాశ తూములు విప్పబడెను. 40 పగళ్ళు, రాత్రులు ప్రచండముగా వర్షం కురిసింది. నీళ్ళు భూమి మీద ప్రవహించడం మొదలు పెట్టినప్పుడు ఓడ నీళ్ళ మీద ప్రయాణించసాగింది. ఆ జలములు భూమిను ముంచెత్తాయి. భూమి మీద ఉన్నత గొప్ప శిఖరాలు, కొండలు అన్నీ మునిగిపోయి, వాటి మీద 15 మూరల ఎత్తున నీళ్ళు నిలిచాయి. అప్పుడు భూమి మీద ఉన్న సమస్త జంతువులు, పక్షులు, పురుగులు, నరులు, నాసికారంధ్రములలో ఊపిరి ఉన్నవన్నీ చనిపోయాయి. ఓడలో ఉన్న నోవహు, అతని కుటుంబము, వారితో కూడ ఉన్నవి మాత్రం జీవించాయి. 150 రోజుల వరకు ఆ నీరు భూమి మీద ప్రవహిస్తూనే ఉన్నాయి. ఆ ఓడ భూమీ మీద ప్రయాణం చేస్తూనే ఉంది.

అప్పుడు దేవుడు నోవహును జ్ఞాపకము చేసికొని భూమి మీద గాలి విసరేటట్లు చేసినప్పుడు ఆ నీరు క్రమక్రమముగా తగ్గిపోవడం ప్రారంభించాయి. ఆ నీరంతా తగ్గిపోవడానికి 150 దినములు పట్టింది. 7వ నెల 17వ దినమున ఆ ఓడ అరారాతు కొండల మీద నిలిచిపోయింది. 10వ నెల వరకు నీరు ఇంకిపోవడం ప్రారంభమయ్యింది. 10వ నెల 1వ దినమున కొండల శిఖరములు కనిపించాయి. 40 రోజుల తర్వాత నోవహు ఓడలోని ఒక కాకిని కిటికి గుండా బయటికి పంపిస్తాడు. అయితే ఆ కాకి తిరిగి రాకుండా నీళ్ళు ఇంకిపోయే వరకు అది భూమి మీద అటు ఇటు తిరుగుతానే ఉంది. అందుకని నోవహు భూమి మీద నీళ్ళు ఇంకిపోయినవో లేదో తెలుసుకోడానికి ఓడలోని ఒక నల్ల పావురాన్ని బయటకి పంపిస్తాడు. అయితే భూమి మీద ఉన్న నీరు ఇంకిపోనందు వలన ఆ పావురము తన కాలు మోపుటకు స్థలము దొరకనందున అది తిరిగి ఓడలోకి వస్తుంది. తర్వాత 7 రోజులకు మరలా ఆ నల్ల పావురాన్ని బయటకు పంపిస్తాడు. అప్పుడు అది బయటకు వెళ్ళి సాయంత్రానికి తిరిగి వచ్చినప్పుడు దాని నోట్లో త్రుంచబడిన ఒలీవ ఆకు చూచి భూమి మీద నీళ్ళు తగ్గిపోయాయని నోవహు అనుకుంటాడు. ఇంకొక 7 రోజులు ఆగి మరలా ఆ పావురాన్ని బయటకు పంపించి నప్పుడు అది తిరిగి రాదు. నోవహు వయస్సు 600 సంవత్సరం 1వ నెల 1వ దినమున నోవహు ఓడ కప్పు ఊడదిసి చూచినప్పుడు భూమి మీద నీరంతా యింకిపోయి ఆరిన నేల కనబడెను. 2వ నెల 27వ దినమున భూమి పూర్తిగా ఎండిపోయింది. అప్పుడు దేవుడు వారిని బయటకు రమ్మని చెప్పినప్పుడు, నోవహు, ఆయన భార్య, కుమారులు, కోడళ్ళు మరియు ఓడలోనున్న సమస్త

జంతువులు, పక్షులు, పురుగులు మొత్తం బయటకు వస్తాయి. అప్పుడు నోవహు పవిత్ర జంతువులలోను, పవిత్ర పక్షులలోను కొన్నిటిని తీసి యెహోవాకు దహనబలిగా అర్పిస్తాడు. అప్పుడు యెహోవా ఇంపైన సువాసన నాఘ్రాణించి "ఇకమీదట నరులనుబట్టి భూమిని మరల శపించను. ఎందుకంటే నరుల హృదయాలోచన బాల్యము నుండి చెడ్డది" అని తన హృదయములో అనుకుంటాడు. అప్పుడు దేవుడు నోవహుతోను అతని కుమారులతోను "సమస్త శరీరులు ప్రవాహ జలముల వలన ఇకను లయ పరచబడరు. భూమిని నాశనము చేయుటకు ఇకను జలప్రవాహము కలుగదు" అని ఒక నిబంధన చేసు కుంటాడు. ఆ నిబంధనకు గుర్తుగా దేవుడు ఆకాశములో తన ధనస్సును ఉంచుతాడు.

దేవుడు నోవహును అతని కుమారులను "మీరు ఫలించి అభివృద్ధి పొంది భూమిని నింపుడి" అని ఆశీర్వదిస్తాడు. అక్కడ నుండి మరలా భూమి మీద నరులు విస్తరించడం ప్రారంభమవుతుంది. ఓడలోకి వెళ్ళిన నోవహు కుటుంబం 8 మంది తప్ప భూమ్మీద ఉన్న మనుష్యులందరూ జల ప్రళయం వలన మరణించారు. ఇప్పటి ప్రపంచంలో ఉన్న ప్రజలంతా షేము, హాము, యాపెతుల నుండి వచ్చిన వారే. జలప్రళయము తర్వాత నోవహు 350 సంవత్సరాలు జీవించాడు. నోవహు జీవించిన కాలము 950 సంవత్స రాలు. తర్వాత నోవహు మరణిస్తాడు.


పిల్లలూ! కథ చదివారు కదా! చూశారా దేవునికి అవిధేయతగా ఉండటం వలన మనుష్యులందరూ ఎలా నశించిపోయారో. నోవహు నీతిమంతుడుగా ఉండటం వలన ఆయన, ఆయన కుటుంబము మాత్రం రక్షించ బడింది. ఆదాము హవ్వలు కూడా దేవునికి అవిధేయతగా ఉండటం వల్లనే నాశనమయ్యారు. కాబట్టి మనం దేవుడంటే విధేయత కలిగి భయము, భక్తితో, నీతి నిజాయితీతో జీవిస్తే మనం కూడా నోవహువలె ఆపద సమయాల్లో కాపాడబడతాము. మరి వచ్చే నెలలో మనం బాబెలు గోపురము గురించి తెలుసుకుందాము. దేవుడు మీకు తోడైయుండును గాక!

## బైబిల్ క్విజ్ - 21 జవాబులు

1. సింహము (1రాజు. 13:24)
2. 22 సంוו లు (14:20)
3. మయకా (15:10)
4. ఒమ్రీ (16:29)
5. సారెపతు (17:8)
6. ఓబద్యా (18:3)
7. హోరేబు (19:8)
8. 32 మంది (20:16)
9. నాబోతు (21:1)
10. కెనయనా (22:24)
11. యెహోరాము (1రాజులు 1:17)
12. 42 మంది (2:25)
13. కీర్హరెశెతు (3:25)
14. షూనేము (4:8)
15. కుష్ఠు (5:1)
16. ఎనుబది రూపాయలకు (6:25)
17. నలుగురు (7:3)
18. హజాయేలు (8:11)
19. యెహోషాపాతు (9:2)
20. రేకాబు (10:15)
21. 6 సంవత్సరములు (11:3)
22. జిబ్యా (12:1)
23. ఎలీషా (13:14)
24. గత్హేపెరు (14:25)
25. పూలు (15:19)

గత నెల ప్రశ్నలకు జవాబులు వ్రాసిన వారు :

**పి. చిన్నారావు**
వినుకొండవారివీధి, బాప్టిస్టునగర్, విజయవాడ
**బి. ఎస్తేరురాణి**
గోగులమూడి, పెదనందిపాడు (మం), గుంటూరు (జి)
**ఆర్. ఇన్నయ్య**
గుంతకల్, అనంతపురం జిల్లా



# బైబిలు ప్రాముఖ్యత

## (Importance of the Bible)

**సేకరణ:** రెవ.డా॥ కె.జోసఫ్

తెలుగు బైబిలు మొత్తము ఆదిమ, హెబ్రీ, గ్రీకు భాషల నుండి భాషాంతరము చేయబడినందున దోష రహితముగా నున్నది. ఆంధ్రక్రైస్తవ సభవారు, అప్పటి హైదరాబాదు క్రైస్తవసభ వారు కూడా ఆలోచించి అన్ని సంఘముల ప్రతినిధులను సమకూర్చి తెలుగు బైబిలును పూర్తిగా పునర్విమర్శ చేయనవసరము లేదు అని నిర్ణయించిరి.

మద్రాసు సహాయ సంఘము నాయకత్వమున సవరణ కమిటీ ఏర్పడి భాషా దోషములను దిద్ది కఠినమైన పదములను సులభపరచి 1952 సం॥న అచ్చు వేయించిరి. అదియే ఇప్పుడు మనము వాడుచున్న బైబిలు.

1920-23 సం॥లో తెలుగు బైబిల్స్ చాలా కరువులో ఉండేవి. ఆ దినములలో తెలుగు బైబిల్‌ను ఆసక్తిగా ఎత్తి వ్రాసిన వారున్నారు. 1892లో ఒక్క సువార్తయైననూ తెలుగులో దొరకలేదట. 1852లో క్రొత్త నిబంధన ప్రతులేవి మద్రాసులో లేవట. దేవుని మహా కృప వలన మనము కొనగలిగిన వెలలో మనకు బైబిల్స్ లభించుచున్నందుకు ఆయనకు మనము స్తుతులు చెల్లించాలి. దీని కొరకై అనేక వ్యయ ప్రయాసలు పడుచున్న సంస్థల కొరకై, సంఘముల కొరకై ప్రార్థించాలి. వాక్యమును భక్తితోను, వణకుతోను చదివి ఆత్మీయ జీవితములో మేలులు పొందాలి. ఈ వాక్యమునకు ఎవరు ఎన్ని వ్యాఖ్యానములు వ్రాసినా, చదివేటప్పుడు దేవుడు నీతో నాతో మెల్లని స్వరముతో పలికే పలుకులను అర్థం చేసుకొని జీవితములకు అన్వయించుకోవాలి.

***"వాక్యము చీకటిగల చోట వెలుగిచ్చు దీపమైనట్టున్నది దానియందు మీరు లక్ష్యముంచిన యెడల మీకు మేలు"*** ***"నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగునై యున్నది"*** కీర్తన 119:105. ఈ పరిశుద్ధ వాక్యములు దేవుని వాక్యములు అని చెప్పడానికి ఏవైనా నిదర్శనములు ఉన్నవా?

ఈ 66 పుస్తకముల కలయిక అయిన బైబిల్ దాదాపు 40 మంది దేవుని భక్తులు దాదాపు మూడు భాషలలో, దాదాపు 1600 సం॥ల మధ్యకాలంలో వ్రాయబడిన దీనిలో ఉన్న ఒకే ఒక్క ఉద్దేశము **"క్రీస్తు ద్వారా సర్వమానవాళికి రక్షణ"**.

***"ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగా పలికిరి"*** 2పేతురు 1:21. ఈ విధంగా పలికిన మాటలు తర్వాత కాలములో మట్టి పలకల మీద, జంతు చర్మముల మీద వ్రాయబడి భద్రపరచబడినవి. ఇవి బబులోను ప్రాంతములలో కనుగొనబడినవి. ఈ వ్రాతప్రతుల చుట్టలో ఒక బైబిల్ పుస్తకములోని కొంత భాగము మాత్రమే సరిపోతుంది. అంటే కొన్ని వందల వ్రాత ప్రతులు భద్రపరచబడినాయన్న మాట. ఈ వ్రాతప్రతులు భద్రపరచబడి, వాటిని తిరిగి కాపీ చేయడంలోను కూడా దేవుడు తన వాక్యమును మన కొరకు భద్రపరిచాడు అని చెప్పగలం. "యెహోవా సెలవిచ్చునదేమనగా", "సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చునదేమనగా", "ఇదే యెహోవా వాక్కు", "యెహోవా యొద్దనుండి వచ్చిన సమాచారము" ఈ విధంగా పాత నిబంధనలో అనేక మార్లు వ్రాయబడియుంది. క్రొత్త నిబంధనలో అపొస్తలుడైన పౌలు తిమోతికి వ్రాస్తూ,

లేఖనములను "దైవావేశము వలన కలిగిన లేఖనములు" అని వర్ణించాడు 2తిమోతి 3:16,17. అలాగే పేతురు కూడా "మనుష్యులు దేవుని వలన ప్రేరేపింపబడి పలికిరి" అని వ్రాశాడు 2పేతురు 2:21.

యేసుక్రీస్తు వారు తన సువార్త సేవాకాలంలో ధనాపేక్షగల పరిసయ్యు లతో మాట్లాడుతూ ***"ధర్మశాస్త్రములో ఒక పొల్లయిన తప్పిపోవుట కంటే ఆకాశమును భూమియు గతించిపోవుట సులభము"*** (లూకా 16:17) అని ధర్మ శాస్త్రము యొక్క ఔన్నత్యమును చాటుతున్నాడు. యేసయ్య, శిష్యులతో "అంతమును" గూర్చి మాట్లాడుతూ "లేఖనములలో వ్రాయబడిన వన్నియు నెరవేరుటకై" (లూకా 21:22) అనే మాట వాడి యున్నాడు. యేసుక్రీస్తు వారు ప్రవక్తల మాటలను అప్పటి ప్రజలకు లేఖనముల నుండి తిరిగి చెప్పుట మనము గమనించగలము. మత్తయి 13:14లో యెషయా ప్రవక్త చెప్పిన ప్రవచనమును, ఇంకా అనేక చోట్ల (యోహాను 13:18, 15:25, 17:12) లేఖనములను ఎత్తి చెప్పుటలో యేసుక్రీస్తువారు పరిశుద్ధ వాక్యము దేవుని వాక్యమని రూఢి పరచుచున్నారు. ఇంకా రూఢిగా చెప్పాలంటే లూకా 24:25-27,44 వచనములలో మనం చూస్తే యేసుక్రీస్తువారు పునరుత్థానుడైన తర్వాత ఎమ్మాయి అను గ్రామమునకు వెళ్ళుచుండిన ఇద్దరు శిష్యులతో నడచుచూ మాట్లాడుతున్న సందర్భములో ఆయన ఆ శిష్యులతో "అవివేకులారా!", "మందమతులారా" అని సంబోధించాడు. కారణమేమంటే యేసుక్రీస్తు వారి పునరుత్థానమును గురించిన ప్రవక్తల పలుకులు వారు నమ్మలేదు. యేసుక్రీస్తు వారు ఈ సందర్భములో (లూకా 24:13 నుండి చివరి వరకు) మోషే ధర్మశాస్త్రము, ప్రవక్తల గ్రంథము, కీర్తనలలో వ్రాయబడిన యధార్థతను ఎంత గట్టిగా నొక్కి చెప్పి యున్నారో అర్థమవుతుంది. ఆయన ఒకసారి సమాజ మందిరములోనికి వెళ్ళినపుడు (లూకా 4:17) యెషయా గ్రంథపు చుట్టను విప్పి (యెషయా 61:1,2) చదివి ఈ లేఖనము నెరవేరినదని వారితో చెప్పెను. ఇలా ఆయన ప్రవక్తల ప్రవచనములను అనగా దైవావేశము వలన కలిగిన ఈ లేఖనములు దేవుని వాక్యముగా అప్పటి ప్రజలకు వక్కాణించియున్నారు.

చరిత్ర కూడా చెపుతుంది పరిశుద్ధ గ్రంథము యధార్థమైనదని. గార్డన్ లిండ్‌సెగారు వ్రాసిన ఒక పుస్తకములో ఆయన కొన్ని ఉదాహరణలు ఇచ్చాడు.

ఐగుప్తు బబులోనులలో జరిగిన భూగర్భ పరిశోధనలలో జలప్రళయము నిజముగా సంభవించినదని ఋజువు కాబడినది – బబులోను చరిత్ర పుటలలో 700 అడుగులకు పైగా కట్టబడిన ఒక గోపురముండెనని అది నిమ్రోద్ ద్వారా కట్టబడినదని ఉన్నది. అబ్రాహాము చిన్ననాటి ప్రాంతమైన "ఊరు" అను పట్టణము ఒకప్పుడు తెలియబడలేదు. అయితే త్రవ్వకములలో "ఊరు" యొక్క చాలా భాగము వెలువడినది. సొదొమ, గొమొఱ్ఱా పట్టణములు అగ్నిచే నాశనమైన విషయాలు ఈ మధ్య కాలమునాటి భూగర్భ పరిశోధనలలో ఆ పట్టణ ప్రాంత ప్రాంగణములలో చాలా పెద్దయెత్తున Sulfur Bitumen ఉన్నట్లుగా కనుగొన బడినది. యెహోషువ 3వ అధ్యాయములో, యొర్దాను నది పైనుండి వచ్చు నీరు ఆగిపోగా ఇశ్రాయేలీయులు ఆరిన నేలను నడచిరనిన విషయం నమ్మలేదు. అయితే 1927లో ఇలాగే యొర్దాను నది పైనుండి వచ్చు నీరు కొన్ని గంటలు ఆగినట్లుగా చరిత్ర చెపుతుంది. ఇలా ఎన్నో విషయాలను ఆయన వ్రాశారు.

ఈ దైవ గ్రంథము యేసుక్రీస్తు వారు ఎక్కడ జన్మిస్తాడో చెపుతుంది. క్రీ.పూ. 500 సం॥లకు పూర్వమే యేసుక్రీస్తు వారు ఈ భూలోకములో జన్మించక ముందే ఆయన యొక్క ఉనికి ఉన్నట్లుగా చెప్పాడు. ***"పురాతన కాలము మొదలు కొని శాశ్వతకాలము ఆయన ప్రత్యక్షమగుచుండును"*** (మీకా 5:2). అంతేకాక ఆయన బేత్లెహేములో జన్మిస్తాడని ప్రవచించాడు. గర్భముతో ఉన్న మరియ కాని, ఆమె భర్త యోసేపు కాని ఊహించి ఉండరు వారు ఇశ్రాయేలు దేశములోని నజరేతు నుండి బేత్లెహేమునకు వస్తారని. కాని రోమా చక్రవర్తియైన ఔగుస్తు వలన ఆజ్ఞ ఇవ్వబడి ప్రజాసంఖ్యలో వారి పేర్లు నమోదు చేసుకొనుటకు తమ

ప్రయాణం తప్పలేదు. వారు బేత్లెహేములో నుండగా ఆమె ప్రసవ దినములు నిండి బాలయేసుని కని సత్రములో స్థలము లేనందున పశుల తొట్టెలో పరుండబెట్టెను. మీకా ప్రవచనము దేవుని మూలము గానే కదా పుట్టినది. అలాగే యేసువారు ఒక కన్యకకు జన్మిస్తాడని క్రీ॥పూ॥ 8వ శతాబ్దం లోని యెషయా ప్రవక్త ద్వారా పలుకలేదా! కన్యక గర్భము ధరించి ఒక కుమారుని కనును ఆయనకు ఇమ్మానుయేలను పేరు పెట్టును (యెషయా 7:14). అలాగే మత్తయి 1:18లో చెప్పబడినట్లు “ఆయన తల్లియైన మరియ యోసేపునకు ప్రధానము చేయబడిన తరువాత వారేకము కాక మునుపు ఆమె పరిశుద్ధాత్మ వలన గర్భవతిగా ఉండెను”. అదే అధ్యాయం 21వ వచనములో ప్రభువు దూత యోసేపునకు స్వప్నమందు ప్రత్యక్షమై ఆమె గర్భము ధరించినది పరిశుద్ధాత్మ వలన కలిగినదని సాక్ష్యమిచ్చెను.

ప్రవచనములు యేసుక్రీస్తువారి పరిచర్యను గూర్చి కూడ పలుకబడినవి. యెషయా 61లో ***“ప్రభువగు యెహోవా ఆత్మ నా మీదకి వచ్చియున్నది దీనులకు సువార్తమానము ప్రకటించుటకు యెహోవా నన్ను అభిషేకించెను. నలిగిన హృదయము గల వారిని ధృడపరచుటకును, చెరలోనున్న వారికి విడుదలను, బంధింపబడిన వారికి విముక్తిని ప్రకటించుటకును యెహోవా హితవత్సరమును మన దేవుని ప్రతిదండన దినమును ప్రకటించుటకును, దుఃఖాక్రాంతు లందరిని ఓదార్చుటకును... యేసుక్రీస్తు వారు ఈ పరి చర్యలో ఉండగా చెరసాలలో ఉన్న బాప్తిస్మమిచ్చు యోహాను ఈ సంగతులు విని “రాబోవు వాడవు నీవేనా, మేము మరి యొకని కొరకు కనిపెట్టవలెనా?”*** (మత్తయి 11:2) అని తన శిష్యులను పంపినపుడు యేసు వారిని చూసి – మీరు వెళ్ళి విన్నవాటిని, కన్నవాటిని యోహానుకు తెలుపుడి. గ్రుడ్డి వారు చూపు పొందుచున్నారు.... బీదలకు సువార్త ప్రకటింపబడుచున్నది” (మత్తయి 11:4–6). ఇంకా ఇలాగ యేసుక్రీస్తు వారు పొందబోవు మరణమును గూర్చి, కీర్తనా కారులు, యెషయా భక్తులు ప్రవచించియున్నారు.

అందుకే ఈ పరిశుద్ధ గ్రంథము యధార్థమును, దేవుని వాక్యమై యున్నదని నమ్ముచున్నాము. మరియు సైన్సు ఏ విధముగా ఈ వాక్యమును దైవవాక్యమని ఋజువు చేయు చున్నదో తెలుసుకుందాం.

***“మీకు తెలియదా? మీరు వినలేదా? మొదటి నుండి ఎవరునూ మీతో చెప్పలేదా? భూమిని స్థాపించుటనుబట్టి మీరు దాని గ్రహింపలేదా? ఆయన ఆసీనుడైయున్నాడు..”*** (యెషయా 40:21,22). అందరూ భూమి బల్లపరుపుగా ఉండేదని ఇప్పటికి 500 సం॥ల పూర్వము వరకు అనుకునే వారు. కొంతమంది ఖగోళశాస్త్రజ్ఞులు ఆకాశములను గ్రహించి భూమి గుండ్రముగా నున్నదని చెప్పినపుడు వారిని దూషించి, హింసించి నానా దుర్భాషలాడినారట. అయితే క్రీ.పూ 8వ శతాబ్దములోనే యెషయా ప్రవక్త భూమి గుండ్రముగా నున్నదని వర్ణించాడు. భూమి బల్ల పరుపుగా ఉన్నదని చెప్పేవాళ్ళలో కొందరు ఈ భూమి క్రింద పెద్ద పెద్ద స్థంభాలు ఆధారముగా ఉన్నాయని అనేవారు. అయితే యోబు 26:7 లో ***“శూన్యము పైని భూమిని వ్రేలాడ చేసెను”*** అని వ్రాయబడినది. భూమి తన చుట్టూ తను తిరుగుచూ సూర్యుని చుట్టూ తిరుగుట వలన కదా మనకి రాత్రి, పగలు, ఋతువులు కలుగుచున్నవి! ఇది బైబిలులో యేసుక్రీస్తు ద్వారా పలుకబడలేదా!


**(సశేషం)**

ఇంటర్నెట్‌లో ‘పరిశుద్ధత’ మాసపత్రిక కొరకు ఈ క్రింది వెబ్‌సైట్ సందర్శించండి

Read Our Internet Edition @

**www.holinessmagazine.com**

# ఏడు సంఘాలు



బ్రదర్ కె.సామ్రాట్

## తుయతైర సంఘము

**(దుర్నీతితో నిండిన సంఘము. ప్రకటన 2:18-29)**

తుయతైర అనగా ఆచార కర్మములు అని అర్థం. ఇది ఏడు సంఘాలకు ఇచ్చిన సందేశాల్లో పెద్దది. 12 వచనాల ప్రసంగ సందేశం. ఈ సంఘకాలం క్రీ.శ. 606-1520 వరకు. ఇది ఎఫెసుకు ఈశాన్యంగా స్ముర్నకవీ సుమారు 45 మైళ్ళ దూరంలో వుంది. ఇది గొప్ప పారిశ్రామిక పట్టణం. యిక్కడి ప్రజలు చేతిపనుల్లో ఆరి తేరిన వారు. అయినా వీటిలో కొన్ని మాత్రమే మిక్కిలి ప్రాముఖ్యత సంతరించుకున్నాయ్. వాటిలో నేతపని, రంగులు, అద్దకాలు, చర్మకారులు, కుంభకారులు - ఎక్కువ. ధూమ్రవర్ణపు చూర్ణం అమ్మే లూదియ కూడా తుయతైర పట్టణస్తురాలే. లూదియనే ఈ సంఘ స్థాపకురాలు (అపో. కార్య. 16:11-15). ఈమె ఐరోపా ఖండంలోని ఫిలిప్పియ పట్టణములో అపొస్తలుడైన పౌలు ప్రసంగించుచుండగా వాక్యము విని రక్షించబడింది. వ్యాపార కేంద్రమైనందున, రకరకాల ప్రజలు కలిసి మెలిసి జీవించేవారు. ప్రస్తుతం తుయతైర పట్టణము 'అకిస్సార్' అని పిలువబడుతుంది.

**పీఠిక:** ఇది అన్య సాంప్రదాయాలతో మునిగిపోయిన సంగం. కారణం రోమా ప్రభుత్వ ప్రభావం తుయతైర మీద ఎక్కువగా ఉంది. 'అగ్నిజ్వాలలోవంటి కన్నులును అపరంజిని పోలిన పాదములుగల దేవుని కుమారుడు చెప్పు సంగతులు ఏవనగా (18వ) అని ప్రారంభిస్తున్నారు. "తన యెడల యధార్ధ హృదయముగల వారిని బలపరచుటకై యెహోవా కనుదృష్టి లోకమందంతట సంచారము చేయుచున్నది" (2దిన. 16:9). అంతేకాదు ప్రభువు కన్నులు నీతిమంతుల మీద ఉన్నాయి (1పేతురు 3:11, కీర్తన. 33:18, 34:15), పాపమును చూడలేని కన్నులు పాపుల కొరకు రాత్రంతా కన్నీరు కార్చిన కన్నులు, కన్నీటితోను, రోదనతోను విజ్ఞాపన చేసినవి. "అందుచేత అతని కన్నులు (కన్నీళ్ళ చేత) ఎఱ్ఱగానైనవి" (యిర్మీయా 13:17, 14:17). కావున సంఘానికి పవిత్రమైన కన్నులు కావాలి. అగ్ని జ్వాలలవంటి కన్నులకు భూమి మీదగాని, భూమి క్రింద గాని, పైన ఆకాశమందుగాని ఏదీ మరుగై యుండదు.

అపరంజివంటి పాదాలు గలవాడు ఆయనే. "ఆయన పాదములు అగ్నిలో పుటము వేయబడి మెరయునట్టి అప రంజితో సమానమై యుండెనని" (ప్రకటన 1:15) యోహాను సాక్ష్యమిచ్చుచున్నాడు. సముద్రము మీద నడిచిన పాదాలు, కరకు రాళ్ళపై కొండలపై నడిచిన పాదాలు, కడకు కల్వరి సిలువలో మేకులు కొట్టబడిన పాదాలు అపరంజిని పోలియున్నవి. ఇట్టి పాదాలుగల ప్రభువే విశ్వాసులకు ఆధిక్యతనిచ్చి, దేవుడు మీ పాదముల క్రింద సాతానును శీఘ్రంగా చితుక త్రొక్కించును అన్నాడు (రోమా 16:20) ఆలాగే సేవ చేసే వాని పాదాలు పర్వతాల మీద సుందరము లుగా కన్పిస్తున్నాయని (యెషయా 52:7) చెప్తున్నాడు. ఈయన దేవుని కుమారుడు గనుక తన యొద్దకు వచ్చు వారికి దేవుని కుమారులగుటకు అధికారం యివ్వాలని కోరుతూ ఆయన ఈ రీతిలో సంఘానికి ప్రత్యక్షమైనాడు. బహుశా తుయతైర సంఘం కుమారత్వం లోని లోతైన అనుభవములోనికి రాలేదేమోనని చెప్పటానికి గాబోలు ఈ ప్రత్యక్షత, ఈ సంఘలో మంచి స్వభావమున్నప్పటికిని

భయంకరమైన తప్పిదములతో జీవిస్తుంది. అనేక తప్పులను గురించి చెబుతున్నాడు.

**మంచి విషయాలు:** "నీ క్రియలను, నీ ప్రేమను, నీ విశ్వాసమును, నీ పరిచర్యను, నీ సహనమును నేనెరుదును" (19వ). వాస్తవానికి వారి మొదటి క్రియల కంటే కడపటి క్రియలు మరి ఎక్కువైనాయి. తుయతైర సంఘ కాలంలో మంచి పనులు చేస్తే రక్షించబడ్తారనే బోధ కూడా అమల్లో ఉండేది. నేనేం తప్పు చేశాను? పాపినని ఒప్పుకోటానికి. ఫలానా వారిలా నేను జీవించటం లేదే, అనేవారు నేడు కూడా ఉన్నారు. తమ క్రియలు తమని రక్షించవని ప్రభువు చెబుతున్నాడు. రక్షించబడిన తరవాత మనం చేసే కార్యకలాపాలకు దేవుని ద్వారా ఘనత చేకూరుతుంది. ఏమైనా సంఘలోని ప్రతివారు తమ విశ్వాసము ద్వారా క్రియలు వెల్లడి చేయాలి. మంచి క్రియల ద్వారా ఎవరు నీతిమంతుడని తీర్చబడరు (రోమా 3:20). ప్రభువు మీద ఆధారపడక తమ నీతిని నమ్ముకోవడం సబబు కాదు.

నీ ప్రేమను నేనెరుగుదును, ప్రభువు పట్ల ప్రేమలేని వారా? కాదు, ప్రేమగలవారే. అయితే ఆ ప్రేమలో సరైన ప్రవృత్తి లేదు. తత్ఫలితంగా దేవుని అభీష్టాన్ని పూర్తిగా గుర్తించలేకపోయారు. పరిపక్వమైన ప్రేమను సంఘం చూపించాలి. నిండు ప్రేమ కలిగించాలి. వారి అమాయకపు స్థితిని ఆసరగా తీసుకొని వారిని నాయకులే పాపం చేయించారు. కొందరు నిష్కళంకంగా ప్రభువును ప్రేమించారు గనుకనే నీ ప్రేమ నాకు తెలుసు అంటున్నాడు ప్రభువు. యికపోతే విశ్వాసంలో చెప్పక్కర్లేదు. చీకటి క్రియల్ని వ్యతిరేకించి నిలిచారు. ఈ మధ్యయుగంలోని విశ్వాసుల్ని వాల్డెన్సియనులు అంటారు. విశ్వాసంతో సత్క్రియలు చేస్తూ దేవుని పనిలో (1థెస్స. 1:3) ముందుకు సాగారు. సంఘమా, మన విశ్వాసాన్ని బేరీజు వేసుకోటానికి యిదో అవకాశమని గుర్తించాలి. అమూల్యమైన విశ్వాసాన్ని సంపాదించుకున్నట్లుగా ఉంది. తుయతైర విశ్వాసమందు సద్గుణమును, సద్గుణమందు జ్ఞానమును, జ్ఞానమందు ఆశానిగ్రహమును అమర్చుకున్న సంఘమన్నమాట.

తుయతైర సంఘము, పరిచర్యలో, సహనంలో గొప్పవాళ్ళు, చక్కని మాటలకన్నా చక్కగా పనిచేయటం శ్రేష్టం అన్నట్లు, మాటలు చెప్పటం కంటే పనులు చేసి చూపించి ఈ సంఘం. సంఘంలో అందరూ మిషనెరీలుగా పోలేరు గాని తదితర విషయాల్లో పరిచర్య చేయగలరు. సంఘంలో పరిచర్య చేయువారు తప్పక ఉంటారు. వారు అనింద్యులుగా మాన్యులుగా ఉండాలి. అట్టి పరిచర్యే తుయతైర లోకానికి చూపించింది. సంఘం ప్రత్యేకమైన పని పరిచర్య చేయడం, ద్రాక్షతోటలో పని చేయడం అంటే యిదే. ఈ మాదిరిగానే నేడు మన సంఘాల్లో కూడా పరిచర్య చేయాలి. ఒకవేళ పరిచర్యకు రమ్మన్న దేవుని పిలుపుకు నీవు అంగీకారాన్ని తెలిపి. ఇంతవరకు ఆచరించి ఉండకపోవచ్చు ఈ రోజే పరిచర్య చేయడానికి మీ జీవితాల్ని అంకితం చేసుకోండి. అట్లే ఈ సంఘం సహనంలో కూడా దిట్టే. క్రైస్తవ నియమావళిలో సహనానికి అగ్రస్థానం ఉంది. సంఘం తన యెదుట ఉంచబడిన పందెంలో ఓపికతో (హెబ్రీ. 12:1) పరుగెత్తాలి. సంఘమా, సహనం అన్నిటికంటే కష్టమైనదని నా అభిప్రాయం. సాధారణంగా మనం ప్రతీదానికి తొందరపడ్తుంటాము. దేవుడు మనకనుగ్రహించే ఈవుల కొరకు కనిపెట్టడానికి చాలా సహనం కావాలి. దుఃఖసమయంలో కలత చెందకుండా, ప్రతికూల పరిస్థితులలో ప్రశాంతంగా ఉండటం. ఒత్తిడిలో పనిచేయటం, గుండెలో మోయరాని బరువును పెట్టుకొని, ముందుకు కొనసాగటం. ఆత్మలో అమిత వేదన ఉన్నా దైవకార్యాలను రోజూ చేయటం సహన్ అనవచ్చు. ఈ సంఘం చాలా ఓర్పు కలిగి తన సాక్ష్యాన్ని నిలబెట్టుకుంది. "మీరు మీ ఓర్పుచేత మీ ప్రాణములను దక్కించుకొందురు" (లూకా 21:19). సహనం మన మనోబలాన్ని సూచిస్తుంది. గనుక సంఘానికి సహనం అత్యవసరము. తుయతైరతో నీ సహనం నేనెరుగుదును అంటున్నాడు ప్రభువు.

**(సశేషం)**

**స్త్రీల విభాగము**

# రూతు



**శ్రీమతి కె. రేచల్ జోసఫ్,**
**హన్నా ఉమెన్స్ ప్రెసిడెంట్**

ప్రియ 'పరిశుద్ధత' పాఠకులకు హన్నా ఉమెన్ ఫెలోషిప్ తరపున మీ అందరికీ ప్రభువు నామమున వందనములు తెలియజేయుచున్నాను. బైబిలు గ్రంథము అంతటిలో స్త్రీల పేరున ఉన్న గ్రంథములు రెండు మాత్రమే. ఒకటి రూతు, రెండవది ఎస్తేరు. ఇక్కడ మనం చూచి నట్లయితే రూతు అన్యురాలిగా మనం గమనించ వచ్చును. అయినప్పటికీ యెహోవా దేవునియందు ఎంతో విశ్వాసము కలిగి ఉన్నట్లు తెలుస్తుంది. తన అత్తయైన నయోమి యొక్క ప్రభావము రూతు మీద ఎక్కువగా పడింది. నయోమి తన ఇద్దరు కోడళ్ళయిన రూతు, ఓర్పాలకు జీవముగల దేవుడైన యెహోవా గురించి, ఆయన చేసిన అద్భుతాల గురించి చెప్పటం వల్ల వారు దేవుని గురించి తెలుసుకో గలిగారు.

ఇక్కడ మనం గమనించినట్లయితే, నయోమి, రూతు, ఓర్పా ఈ ముగ్గురు విధవరాండ్రుగా ఉన్నట్లు చూడగలం. ఎక్కడో దూరంగా అన్యదేశంలో, అన్యుల మధ్య మగదిక్కు లేకుండా జీవించాలంటే చాలా కష్టమైన విషయం. అయినప్పటికీ నయోమికి ఉన్న విశ్వాసము వల్లనే వారు ఎంతో ధైర్యంగా ఉన్నట్లు చూడగలం. అయితే నయోమి తన దేశమునకు తిరిగి వెళ్ళాలని నిశ్చయించుకొని వారిని వారి వారి ఇండ్లకు వెళ్ళమని చెప్పినప్పుడు, వారు ఆమెతో కూడా యూదా దేశమునకు వస్తామని చెప్పారు. అయితే నయోమి అందుకు ఒప్పుకోనప్పుడు, ఓర్పా తన యింటికి వెళ్ళిపోతుంది. రూతు మాత్రం ససేమిరా తన యింటికి వెళ్ళటానికి యిష్టపడదు. అత్తతోనే తన జీవితం అని చెప్తుంది. మరణము తప్ప మనిద్దరిని ఏది వేరు చెయ్యలేదు అని ఖరాఖండీగా చెప్పేటంత తెగింపు ఆమెకు అప్పటికి అప్పుడు కలిగినది కాదు. ఆమె ఎప్పుడో నిర్ణయించుకుంది. రూతు తీసుకున్న నిర్ణయం ఆమె జీవితాన్ని ఎంతో ఉన్నత స్థాయికి తీసుకెళ్ళింది. అత్తతో వెళ్తే ఆమెకు ఆస్తిపాస్తులు వస్తాయని కానీ, ఇంకో పెళ్ళి చేస్తుంది అని కానీ, బంగారు భవిష్యత్తు ఉంటుందని కానీ ఆమె కోరుకోలేదు. చావటానికి సిద్ధపడి వెళ్ళింది. ఈ రోజుల్లో మనం చూస్తే విధవరాండ్రు అయిన యౌవ్వన స్త్రీలు, వాళ్ళ తల్లిదండ్రుల దగ్గరకు పుట్టింటికి వెళ్ళటం సహజం. అయితే యౌవ్వనస్తురాలైన రూతు సమస్తము త్యాగం చేసి తన అత్తతో జీవించటానికి వెళ్ళటానికిగల కారణం దేవునియందలి విశ్వాసమే. అందుకే యేసుక్రీస్తు వంశావళిలో ఆమెకు చోటు దక్కింది. దేవుని యందలి విశ్వాసముగలవారి జీవితాలను దేవుడు ఎలా మార్చివేస్తాడన్న దానికి రూతు జీవితం ఒక నిదర్శనం. నేటి యౌవ్వన స్త్రీలకు రూతు ఆదర్శప్రాయురాలు.

రూతు యొక్క గుణగణాలైన విధేయత, ఓర్పు, సహనం, ప్రేమ, త్యాగం, దేవునియందలి భయభక్తులు ఇవన్నీ ప్రతి స్త్రీలో ఉండాల్సిన లక్షణాలు. స్త్రీ ఒక కూతురుగా, భార్యగా, తల్లిగా నెరవేర్చాల్సి బాధ్యతలకు ఈ గుణాలు ఎంతో అవసరమై వుంది. రూతు జీవితం ప్రతి యొక్క స్త్రీకి ఆదర్శంగా ఉండాలని, ఆమె జీవితం ఒక పుస్తకంగా రూపు దిద్దుకొని పరిశుద్ధ గ్రంథములో పొందుపరచబడి, దేవునిచే ఘనపరచబడింది. కాబట్టి మనమందరము రూతువంటి గుణాలు కలిగి మన కుటుంబాలను దేవునియందలి భయభక్తులతో నడిపించి దేవుని నామాన్ని ఘనపరచుదాం. ఆమెన్!

సాక్ష్యము

# సువార్తికుడిగా మారిన కమ్యూనిస్టు

మా తాత గారి పేరు కలపాల అబ్రాహాము. అవ్వ శారా. మా తండ్రిగారి పేరు ఇస్సాకు, తల్లి సంతోషమ్మ. నేను, ఇద్దరు అక్కలు సంతానం. నాకు మా తాతగారి పేరు అబ్రాహాము అని పేరు పెట్టారు. గుణదలలో మేము నివశించే ప్రాంత స్థాపకులు మా పితరులు అందువలన మా వీధిని కలపాల వీధి అంటారు. మా తండ్రి గ్రామ పంచాయితీలో పనిచేస్తూ వ్యవసాయం చేసేవారు.

నన్ను సి.యస్.ఐ. ఎలిమెంటరీ స్కూలులో చేర్చారు. హైస్కూలు గుణదల సీయోను పాఠశాల. చదువు అబ్బలేదు. మధ్యలో ఆపివేశాను. అప్పటి నుండి వీధిలోని పెద్దలతో తిరగటం వారితో కూర్చోని పిచ్చాపాటి మాట్లాడటం అలవాట య్యింది. అలాగే కమ్యూనిస్టు సిద్ధాంతాలకి లోబడిపోయాను. అలా నాకు 18 సం॥ల వయస్సు వచ్చేసరికి పేరు మోసిన రౌడి షీటరునయ్యాను. నారాయణ, సత్యం, చెరుకూరి, నా జతగాళ్ళు. కొట్లాటలు గలాటాలు ముమ్మురంగా జరిపేవాడిని.

రక్తం చిందించకుండా ప్రభువు నన్ను ఆరోజుల్లో కాపాడా డని నమ్ముతున్నాను. చాల తెలివిగా ఉండి రక్షకభటులకు దొరకలేదు. నా వెంట నాలాంటి వారు ఏడుగురయినా తిరిగేవారు. మారణాయుధాలు గండ్రగొడ్డళ్ళు బరిశెలు అందుబాటులో ఉంచుకొనేవాళ్ళం. వాటిని తయారు చేసి అవసరమన వాళ్ళకి సరఫరా చేసేవాడిని.

ఇంట్లో మా తల్లిదండ్రులకు తెలియకుండా వాటిని గోడ లోపల దాచేవాడిని. చివరికి నేనేమయిపోతానో అని మా తల్లిదండ్రులు నిత్యం దుఃఖిస్తుండే వారు. నేను చచ్చిపోతే ఇంట్లో దీపం పెట్టెవారు ఉండరని, నాజీవితాన్ని మార్చు కోమని మా తల్లిదండ్రులు నన్ను ఏడుస్తూ ప్రాదేయపడేవారు. ఒక వేళ పెండ్లి చేస్తే నేను మారిపోతానన్న ఆశతో నా 18వ సం॥లోనే గుంటూరు జిల్లా నారా కోడూరు వాస్తవ్యులు సందేటి రాజారావు, ఆగ్నేసమ్మల రెండవ కుమార్తె నిర్మలకుమారితో 25 జులై 1974 లో గుణదలలో వివాహము జరిపించారు. అయినా నా జీవిత విధానంలో ఏమార్పు రాలేదు. ఇలా ఉన్నప్పటికీ త్రాగుడు పేకాట అలవాటు కాలేదు. నాతోటి వారందరు త్రాగేవారు దొంగ సొత్తు విషయం దొంగతనానికి దూరంగా ఉండేవాడిని. నాకు వినయకుమార్, సుధారాణి అనే ఇద్దరు పిల్లలు కలిగారు.

నా భార్య మూడవ కాన్పుకు సిద్ధమవుచుండగా ఒకరోజు నేను ఇంట్లో భోజనం చేస్తుండగా బయట పిచ్చికుక్క వచ్చిందని విన్నాను అది లోపలికి వస్తుందేమోనని గోడలో దాచిన బరిసెను వాకిటివైపు విసిరాను అదే సమయములో ప్రక్కన బాత్‌రూంలో నుండి బయటకు వస్తున్న నా భార్య తోడలోనికి ఆ బరిసె దూరి బయటకు వచ్చింది. అమ్మో గుచ్చుకొంది అని అరచి నా భార్య పడిపోయింది. నేను బయటికి పరుగెత్తి వస్తే అంతా నెత్తురు మడగు అయింది. ఆ గాయంలో సన్నని టవలు పెట్టినా రక్తం ఆగలేదు. నా బన్నీను రక్తంతో తడచిపోయింది. చుట్టుప్రక్కలు ఇళ్ళలోని వారు అందరూ చూస్తున్నారు కాని నా పొగరుబోతు ప్రవర్తన నెరిగి ఉన్నవారు కనుక ఎవరు దగ్గరకు రాలేదు. నా కుమారుడు కుమార్తె కూడ నన్ను చూసి భయపడి దగ్గరకు రాకుండా ఏడుస్తున్నారు. పెద్దగా ఏడిస్తే మమ్ముల్ని కూడ చంపుతాడేమో అనుకున్నారు. నేను ఆ బరిసెను నాభార్య మీదకి కోపంతో విసిరానని అందరు అనుకున్నారు.

నా భార్య సొమ్మసిల్లిపోతూ "అయ్యా నేను చనిపోతానేమో అని అన్నది అయిదు నిమిషాలలో శరీరం నీలంరంగులోకి మారిపోయింది. అప్పుడు నేనే తెగించి సెంటర్‌కి వెళ్లి రిక్షాని పిలుచుకొని రాబోయాను. నేను అటువెళ్ళగానే చుట్టుప్రక్కల వాళ్లు అందరూ నాభార్య దగ్గరకు వచ్చారు. అందరూ నన్ను నానారకాలుగా దుర్బాషలాడటం ప్రారంభించారు. నా తల్లి దండ్రులు కూడా నేనే నా భార్యను పొడిచానని నమ్మారు.

రిక్షాలో నా భార్యను డాక్టరు సమరంగారి ఆస్పత్రికి తీసికొని వెళ్ళాను. ఇది మర్డరు కేసు కనుక గవర్నమెంటు ఆస్పత్రికి తీసికొని వెళ్ళమన్నారు.కాని అక్కడ నిరీక్షణ అనే నర్సు డాక్టరు గారికి నచ్చచెప్పి ట్రీట్‌మెంటు ఇప్పించింది. పది కుట్లు వేశారు. అడ్మిట్ చేసికొని 36 గంటలు దాటితే కాని చెప్పలేమన్నారు. చాలా రక్తము కొని ఎక్కించారు. ఆమె బ్రతికింది. నా భార్య పుట్టింటివారు వచ్చి మా పిల్లను మేము తీసికొని వెళ్తాము, నీ పిల్లల్ని నువ్వు తీసికో అని నా భార్యను తీసికొని వెళ్ళబోయారు. ఎవడ్రా నా భార్యని తీసికొని వెళ్ళేది అని బరిసే తీసికొని వచ్చాను. అప్పుడు వాళ్ళు భయంతో అది- చచ్చింది అనుకొంటాము అని పారిపోయారు. రక్తం చూసి కూడ నా జీవితంలో మార్పు రాలేదు. తర్వాత సలోమి, ఐజక్ అని ఇద్దరు పిల్లలు నాకు జన్మించారు.

కమ్యూనిష్టులకి కులం, మతం లేదు. అయినా అక్కడ కమ్యూనిష్టులలో అగ్రకులాల వాళ్ళు మిగతా వారిని హీనంగా చూచేవారు అందువలన నేను అగ్రకులస్తులను తీవ్రంగా ఎదిరించేవాడిని, వాళ్ళు నన్ను చంపటమో లేక రెండు కాళ్ళు విరగదియ్యటమో చేయాలనుకున్నారు.

1981 లో గుణదల గ్రామ ప్రసిడెంటు కమ్యూనిటీ వాటర్ స్కీమ్‌లో ఫిల్టరు చెక్ ఆపరేటరుగా పది పైసలయినా లంచం తీసికోకుండా ఉద్యోగం ఇచ్చారు. అక్టోబరు 31న ఉద్యోగంలో చేరాను. గుణదలలోని జాన్ విల్లియమ్స్‌గారు సువార్త సభలు పెట్టించారు. ఇప్పుడు దేవినగర్‌లో గ్రేస్ గ్రాఫిక్స్ నడిపిస్తున్న ఇందుపల్లి శ్యామ్‌బాబు (నా మేనల్లుడు) ప్రభువును తన స్వరక్షకునిగా అంగీకరించి మరి కొందరు ప్రభువు బిడ్డలతో నా రక్షణ కొరకు ప్రార్ధించసాగారు. 1982న సి. విజయబాబు కాకినాడ నుండి మీటింగులకు వచ్చారు. ఆయన వాక్యము వినటానికి రమ్మని శ్యామ్‌బాబు నా చేతులు పట్టుకొని బ్రతిమిలాడాడు. అప్పుడు 1982 మార్చి 11వ తారీఖున శ్యాంబాబు మాటల ఒత్తిడికి లొంగి మీటింగ్‌కి వెళ్ళి కూర్చున్నాను. విజయబాబుగారు "దేవుడైన యెహోవా ఆదాముతో నీవెక్కడ ఉన్నావని" పిలిచినట్లు చెప్తూ కడపటి ఆదామయిన యేసుప్రభువు పునరుత్థానుడైన సంగతి చెప్పుచుండగా ఆ వాక్యము నా హృదయములో గుచ్చబడింది. నాకు తెలియకుండానే ఆసభలోనే ఏడుస్తున్నాను సభ అయిపోయిన తర్వాత దైవజనుదు నాయొద్దకు వచ్చి నన్ను పలకరించి ప్రార్ధన చేసాడు. దేవుని శక్తి నన్ను లాగింది. ఇక నుండి ప్రభువును వెంబడించు అని చెప్పి ఆయన వెళ్ళిపోయాడు.

ఆ పశ్చాత్తాపము నన్ను విడువలేదు. ఆ రాత్రి నైట్ డ్యూటికి వెళ్లవలసి ఉండగా ఇంటికి వచ్చేసాను. పోలీసులకు దొరకకుండా దాచిపెట్టిన ఆయుధములను గొతాములో కట్టాను. పార్టీ ఆఫీసుకు వెళ్ళి పార్టీకి రిజైన్ చేసిన ఉత్తరం ఇచ్చి ఇద్దరు కార్యకర్తలను వెంటబెట్టుకొని ఇంటికి వచ్చి నాకు ఆయుధాలు ఎవరిచ్చారో వారికి ఇచ్చి వేశాను.

తెల్లవారి ప్రొద్దున బీరువాలో ఉన్న పుస్తకాలు కరపత్రికలు మొత్తం కాల్చివేశాను. అవి నా జీవితాన్ని నాశనం చేశాయి. 1983 లో బైబిలు మొత్తం మోకాళ్ళ మీద ఉండి చదవాలని తలంపు కలిగి ఆదికాండము నుండి ప్రకటన గ్రంధము వరకు మోకాళ్ళ మీద చదివాను. తర్వాత 10 సార్లు బైబిలు మొత్తం చదివాను.

అప్పుడు పాత అలవాట్లలన్నీ ప్రభువు తొలగించాడు. కొందరు సభలు పెట్టి వాక్యము చెప్పటానికి నన్ను తీసికొని వెళ్ళేవారు. పొలాలకు వెళ్ళి గంటలు గంటలు ఏకాంత ప్రార్ధనలో గడిపేవాడిని. గుణదల కొండ మీదకి వెళ్ళి ప్రార్ధించేవాడిని. సైకిల్ త్రొక్కేటప్పుడుగానీ, ఏ పని చేస్తున్నా గానీ ప్రార్ధిస్తూ ఉండే వాడిని. సంపూర్ణ సేవలో ప్రవేశించిన తర్వాత ఇప్పటికి ఆంధ్రప్రదేశ్ లో 1700 గ్రామాలలో సువార్త ప్రకటించారు. కర్ణాటక రాష్ట్రంలో కూడ ప్రభువు వాక్యము ప్రకటించాను.

లక్షలు నాకు లేకపోయనా కానీ, నాకు 'లేమి' లేదు. 4,000 మందికి పైగా నా ద్వారా బాప్తిస్మము పొందారు.

ఇదే విధంగా జీవితాంతము అనేక గ్రామాల్లో పట్టణాలలో రాష్ట్రాలు తిరిగి సువార్త ప్రకటిస్తూ అనేక మందిని ప్రభువు చెంతకు నడిపిస్తూ అనేక సంఘాలను ఆధ్యాత్మికముగా బలపరుస్తూ జీవితం ముగించాలని ఆశ కలిగి ఉన్నాను. నా కొరకు ప్రార్ధించండి.

# లోకంతీరు 1

(పుట్టుక చావు మధ్య సంబరం)

## నేను భూమికి పునాదులు వేసినప్పుడు నీవెక్కడ నుంటివి?

మరణద్వారములు నీకు తెరువబడెనా? మరణాంధకార ద్వారములను నీవు చూచితివా? వర్షమునకు తండ్రియున్నాడా? మంచు బిందువులను పుట్టించువాడెవడు? కృత్తిక నక్షత్రములను నీవు బంధింపగలవా? మృగశీర్షకు కట్లను విప్పగలవా? వాటి వాటి కాలములలో నక్షత్ర రాసులను వచ్చునట్లు చేయగలవా? ఆకాశమండలపు కట్టడలను నీవెరుగుదువా? దానికి భూమి మీదగల ప్రభుత్వమును నీవు స్థాపింపగలవా? జల రాసులు నిన్ను కప్పునట్లు మేఘములకు నీవు ఆజ్ఞ ఇయ్యగలవా? మెరుపులు బయలు వెళ్లి –చిత్తము ఉన్నామని నీతో చెప్పునట్లు నీవు వాటిని బయటికి రప్పింపగలవా? అంతరింద్రియములలో జ్ఞానముంచిన వాడెవడు? హృదయమునకు తెలివినిచ్చిన వాడెవడు? (యోబు 38)

ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండ నేరడు; అతడు ఒకని ద్వేషించి యొకని ప్రేమించును; లేదా యొకని పక్షముగానుండి యొకని తృణీకరించును.

### మీరు దేవునికి సిరికిని దాసులుగా నుండనేరరు. (మత్తయి 6:24)

### ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము (1తిమోతి 6:10)

**పుట్టుక**

**దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది.2:7)**

ఒక మనిషి జీవితం ఎంతో విలువైనది. మొదటి ప్రాధాన్యత ఆ మనిషి తనకు ఇచ్చుకున్న తర్వాతే ఇంక మిగతావి. ఇది మనిషి సహజ గుణం. అంటే తను, తన కుటుంబం, తన బంధువులు, స్నేహితులు ఇలా తనకు తనకు సంబంధించిన వారి తర్వాతే ఏదైనా. ఆచరణలో దీన్ని అధిగమించటం చాలా కష్టం. దేవున్ని నమ్మిన వాళ్ళు సైతం దీనికి అతీతులు కారు.

దేవుడు ఆదాము, హవ్వలను చేసిన తర్వాత మంచి చెడ్డల తెలివిని ఇచ్చే చెట్టును వేయకపోయినట్లయితే ఎలా వుండేది? దేవుడు మంచిచెడ్డల తెలివినిచ్చే వేయడంలో దేవుని ఉద్దేశ్యం ఏమైవుంటుంది? దేవుడు మనిషిని ప్రేమిస్తున్నాడు అనటానికి గుర్తు మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టును వేయడం. మనిషికి ఇచ్చిన స్వేచ్ఛకి గుర్తు మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు. దేవుడు మనిషిని ప్రేమిస్తున్నాడు, మనిషి దేవున్ని ప్రేమించాలి. అదే దేవుడు కోరుకొనేది. ఆదాము, హవ్వలకు పరీక్ష మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు. వారు దేవున్ని హృదయ పూర్వకంగా ప్రేమిస్తే ఎలాంటి ప్రలోభాలకి లొంగకుండా దేవుని ఆజ్ఞ పాటించి పండు జోలికి వెళ్ళరు.

“మంచిచెడులు” “తెలివినిచ్చేచెట్టు”. మనిషి తనకు ఏది మంచిదో, ఏది చెడ్డదో తెలుసుకోవాల్సిన అవసరం మనిషికి లేదని దేవుని ఉద్దేశం. మనిషికి ఏమి అవసరమో అవన్నీ దేవుడు సృష్టించాడు. మనిషిని చేసిన తర్వాత దేవుడు ఇంక మనిషి అవసరాల కోసం ఏమి సృష్టించలేదు. మనిషి తినడానికి అనేక రకాలైన పండ్లు ఇచ్చాడు. వాళ్ళు కడుపు నింపుకోడానికి మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు ఫలము తినాల్సిన అవసరం ఏమీ లేదు. కాబట్టి మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు మనిషి విశ్వసనీయతకు ఒక పరీక్ష.

ప్రతి మనిషి జీవించడానికి అవసరమైనది మొదట ఆహారము. ముందు కడుపు నిండిన తర్వాతే మిగతా విషయాల గురించి ఆలోచిస్తారు ఎవరైనా. బాగా ఆకలి అవుతుంటే మంచి బట్టలు వేసుకోవాలని కాని, ఖరీదైన ఇల్లు కావాలని కాని కోరుకోరు. కాబట్టి మనిషి మొదటగా ఆహారము విషయంలో నమ్మకముగా వుండాలి. మనిషి ఆహారము వలన మాత్రమే కాక దేవుని నోట నుండి వచ్చు ప్రతి మాట వలన బ్రతుకును అని నమ్మాలి. ఏలియాని దేవుడు పోషించాల్సి వచ్చినప్పుడు ముందుగా కాకుల ద్వారా ఆహారము పంపించాడు, తర్వాత పేద విధవరాలి ద్వారా పోషింపబడ్డాడు. కాబట్టి దేవుని మీద ఆధారపడిన వారికి దేవుడే పోషకకర్త. మన మంచి చెడ్డలను మనమే చూసుకోకుండా దేవునికి అప్పజెప్పినప్పుడు దేవుడు మన మంచిచెడ్డలను చూస్తాడు. సరే, దేవుడు మనిషికి తెలివితేటలు ఇచ్చాడు కదా! మన మంచిచెడ్డలు మనం చూసుకోసుకుండా అన్నిటికీ దేవుని మీద ఆధారపడాలా అని అనుకోవచ్చు. దేవుడు మనిషికి తెలివితేటలు ఇచ్చింది, తన సృష్టికర్త ఎవరో తెలుసుకొని ఆయన ఆజ్ఞల ప్రకారం నడుచుకోడానికే కాని, దేవుడిచ్చిన తెలివితేటలతో దేవునికి దూరమవమని కాదు.

**చావు**

**ఏలయనగా నేల నుండి నీవు తీయబడితివి; నీవు మన్నే గనుక తిరిగి మన్నైపోదువని చెప్పెను (ఆది.3:18)**

సరే, ఇప్పుడు జరుగుతుంది ఏంటి? ప్రతి మనిషి తన తెలివితేటలతో తన అవసరాలు తీర్చుకోడానికి అంటే తిండి, బట్ట, ఇల్లు, ఆస్తులు, స్థలాలు, పొలాలు, బంగారం ఇంకా తన అవసరాలకు మించి సంపాదించుకోడానికే తన జీవితం మొత్తం సరిపోతుంది. తనను సృష్టించిన దేవున్ని గురించి పట్టించుకోలేనంత బిజీగా సంపాదించుకోవడం తోనే జీవితకాలం ముగిసిపోతుంది. ఆదాము హవ్వలు అలా దేవుడు వారికిచ్చిన తెలివితేటలు కాకుండా, ఇంకా తెలివితేటలు సంపాదించడానికి, దేవుడు వారికిచ్చిన శాంతి సమాధానాలు కాదని దేవదూతల్లా వెలిగిపోవడానికి, దేవుడు వారికి సరిపోయినంతకంటే ఎక్కువగా తినడానికి ఇచ్చినా, దేవుని ఆజ్ఞని కాదని దేవుడు తినవద్దని చెప్పినది తిన్నారు. అందువల్ల దేవుడు వారికి ఇచ్చిన ఆధిక్యతలన్నీ కోల్పోయారు. మనిషిని సృజించడానికి ముందే మనిషికి ఏమి అవసరమో అన్నీ సృష్టించాడు. మనిషిని సృజించిన తర్వాత ఇంకేమి సృష్టించలేదు. తను చేసిన పని అంతటి నుండి విశ్రమించాడు. అలాగే ప్రతి మనిషి నిద్రలేవడానికి ముందే మనిషికి అవసరమైవన్నీ దేవుడు సిద్ధం చేసి వుంచుతాడు. అయితే మనిషి అది గ్రహించకుండా తన తెలివితేటలతో సంపాదించుకోవడానికే ప్రాధాన్యతనిస్తాడు. అందుకే దేవుడిచ్చే దానిని కోల్పోతాడు. మనుష్యులకున్న సమస్యలన్నిటిని దేవుడు గోటితో తీసేసేలోపే మనిషి తన తొందరపాటుతో గొడ్డలి ఉపయోగించి తీయటానికి సిద్ధమవుతాడు.

పండు తినక ముందు వారు ఎలాంటి కష్టాలు లేకుండా చీకూ చింతా లేని జీవితం గడిపారు. పంటలు పండించుకోలేదు, బట్టలు వేసుకోవాల్సి అవసరం కూడా లేకుండా, కడుపునిండా తిని హాయిగా తోటలో నిద్రపోయేవారు. అంతేకాక ప్రతి రోజు దేవుడు వారిని పరామర్శించే వాడు. సమాధానకరమైన జీవితం వారు జీవించే వారు. వారి అవసరాలేంటో కూడా వారికి తెలియకుండా నిశ్చింతగా వుండేవారు. పండు తిన్నాక అప్పటి వరకు వారికి వున్న నిశ్చింత పోయింది. ముందుగా వారికి భయం ఆవహించింది. వారి సిగ్గు వారికి తెలిసింది. వారు తాము దిగంబరంగా వున్నా మని తెలిసి సిగ్గుతో, భయంతో చెట్టును ఆశ్రయించారు. దేవుని ఎదుటకు వచ్చే ధైర్యం కోల్పోయారు. నిందలు మోపుకోవడం మొదలు పెట్టారు. దేవుని సన్నిధి నుండి గెంటి వేయబడ్డారు. అబద్దాలు, హత్యలు ఇంకా నానారకాలైన పాపాలు చేయటానికి నాంధి పలికింది. ఇదంతా ఎందుకు? దేవుడు వారికిచ్చిన జీవితాన్ని కాదని, ప్రలోభాలకి లొంగి అవసరం లేనిదానికోసం, దేవుడు వారికివ్వని దానికోసం ప్రాకులాడటమే. అది ఆనాటి మానవుని కథ.

**(ఇంకావుంది)**



# అక్షరయజ్ఞం



శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

## బైబిల్ క్విజ్ - 22

2రాజులు 16 నుండి 1దినవృత్తాంతములు10 వరకు

1. ఏలతును పట్టుకొనిన సిరియా రాజు పేరు ఏమిటి? (2రాజులు 16 అధ్యాయము)
2. అష్షూరు రాజు షోమ్రోనును ఎన్ని సంవత్సరములు ముట్టడి వేసెను? (17వ అ.)
3. హిజ్కియా ఏలుబడిలో యూదా దేశము మీదికి వచ్చిన అష్షూరు రాజు పేరేమిటి? (18వ అ.)
4. కూషు రాజు పేరు ఏమిటి? (19వ అ.)
5. దేవుడు హిజ్కియాకు ఎన్ని సంవత్సరాల ఆయుష్షును పెంచెను? (20వ అ.)
6. మనష్షే ఎక్కడ సమాధి చేయబడెను? (21వ అ.)
7. యెషీయా తల్లి పేరు ఏమిటి? (22వ అ.)
8. యోషీయా ఏలుబడిలో ఏ సంవత్సరమున పస్కా పండుగ ఆచరింపబడెను? (23వ అ.)
9. యెహోయాకీను తల్లి పేరు ఏమిటి? (24వ అ.)
10. యెహోయాకీనును చెరసాల నుండి విడిపించిన బబులోను రాజు ఎవరు? (25వ అ.)
11. హదదు భార్య పేరు ఏమిటి? (1దినవృత్తాంతములు)
12. కాలేబు ఉపపత్ని పేరు ఏమిటి? (2వ అ.)
13. షెమయాకి ఎంతమంది కుమారులు? (3వ అ.)
14. ఫరో కుమార్తె పేరు ఏమిటి? (4వ అ.)
15. గిలాదు తండ్రి పేరు ఏమిటి? (5వ అ.)
16. ఎలియాజరు మనుమడి పేరు ఏమిటి? (6వ అ.)
17. ఆషేరు సంతతిలో యుద్ధమునకు పోతగిన వారి సంఖ్య ఎంత? (7వ అ.)
18. ఊలాము కుమారులు దేనియందు ప్రవీణులైన పరాక్రమశాలులు? (8వ అ.)
19. యోనాతాను కుమారుని పేరు ఏమిటి? (9వ అ.)
20. ఫిలిష్తీయులు సౌలు తలను ఏ గుడిలో ఉంచిరి?(10వ)

### గమనిక

మీ జవాబులను **SMS/E-mail** ద్వారా కూడా పంప వచ్చును. **SMS** ద్వారా పంపేవారు మీ పేరు, సీరియల్ నంబరుతో బైబిల్‌క్విజ్-22 అని టైపు చేసి, ప్రశ్న నంబరు, జవాబు, బైబిల్ రెఫెరెన్సుతో జవాబులన్నీ ఒకే మేసేజ్‌లో 9440217726 నంబరుకు పంపాలి. **E-mail**ద్వారా పంపేవారు సబ్జెక్ట్ దగ్గర మీ పేరు, సీరియల్ నంబరు, బైబిల్ క్విజ్-22 అని టైపు చేసి ప్రశ్న నంబరు, జవాబు, బైబిల్ రెఫెరెన్సుతో 20 ప్రశ్నలకు జవాబులన్నీ ఒకే మెయిల్‌లో holiness.ierf@gmail.comకి పంపాలి.

పోస్టుకార్డు లేదా ఎన్వలప్ కవరు ద్వారా పంప దలచిన వారు ఈ నెల 30వ తేదిలోపు **పరిశుద్ధత-బైబిల్ క్విజ్, పోస్ట్‌బాక్స్ నెం.28, ఒంగోలు-523001** అడ్రసుకు పంపగలరు.

అన్ని ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాసిన వారికి

**పరలోకము-నరకము**

అను పుస్తకము ఉచితముగా పంపబడును

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం. కావున ప్రతి ఒక్కరూ ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొని బైబిలు జ్ఞానము సంపాదించటంతో పాటు బహుమతులు గెలుపొందవలసినదిగా కోరుచున్నాము.